1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | డిసెంబర్ 01, 2024 | www.navatelangana.com

పెన్షన్ పాట్లు

- పోస్టాఫీస్ పాస్ బుక్కులతో క్యూ

నవతెలంగాణ-సదాశివనగర్



పెన్షన్ డబ్బులు తీసుకునేందుకు లబ్దిదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. బీపీఎం రెండుమూడు రోజులే డబ్బులు చెల్లించడం, అది కూడా ఆ రోజు మటుకు వారు తీసుకొచ్చిన డబ్బులు ఉన్న వారు చెల్లించి మధ్యాహ్నం వెళ్లిపోతుండటంతో డబ్బులు తీసుకునేందుకు ఉదయం 8 గంటల నుంచి బారులు తీరుతున్నారు. పాస్‌బుక్కులు తీసుకొచ్చి వరుసలో పెట్టి ఎదురుచూస్తున్నారు. రెండుమూడు రోజులే కాకుండా ఇంకా ఎక్కువ రోజులు పెన్షన్ డబ్బులు చెల్లించేలా అధికారులు చొరవ చూపాలని లబ్దిదారులు కోరుతున్నారు.

నేటి నుంచి ప్రజావిజయోత్సవాలు

- 9వ తేదీ వరకు ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

నేట నుంచి 9వ తేదీ వరకు జిల్లాలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు ఘనంగా పెద్ద ఎత్తున నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 1 నుండి 9 వరకు జిల్లాలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు అన్ని శాఖల సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపారు. శాఖల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాఖాపరంగా కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాల విజయగాథలను తెలిపే విధంగా ఫ్లెక్సీ లను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, వి.విక్టర్, జిల్లా అటవీ అధికారిణి నిఖిత, జడ్పీ సీఈవో చందర్ నాయక్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నాణ్యమైన భోజనం పెట్టాలి

- హాస్టళ్లను, గురుకులాలను మానిటరింగ్ చేయాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత కలిగి ఉండే విధంగా ఆయా ఇన్‌చార్జిల పర్యవేక్షణ నిర్వహిస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని మండల విద్యాధికారులు, వసతి గృహాల సంక్షేమ అధికారులకు ఆహార భద్రతపై ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో జరుగుతున్న వార్తలపై జిల్లాలోని యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం, వసతి గృహాల్లోని విద్యార్థులకు రుచికరమైన, నాణ్యత భోజనం అందించాలని తెలిపారు. ఫుడ్ పాయిజన్ కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీరు కలుషితం, వస్తువులు, పదార్థాలు గడువు తేదీ ముగిసినవి వాడకుండా చూడాలని పేర్కొన్నారు. బియ్యంలో పురుగులు ఉండకుండా, వంటలు వన్డే ముందు పరిశీలించాలని తెలిపారు.

పురుగులు పట్టిన బియ్యం ను పౌర సరఫరాల సంస్థకు తిరిగి పంపించాలని సూచించారు. ఎలుకలు రాకుండా చర్యలు తీసుకోవాలని, సరుకులు, బియ్యం సంచులను బెంచీలపై ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో ప్రతీ ఇన్‌స్టిట్యూట్‌కు ఆయా ప్రిన్సిపాల్‌లతో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీ ప్రతీ రోజు విద్యార్థులకు అందించే భోజనాలను పరిశీలించాలని, విద్యార్థులతో భోజనాలు చేయాలని తెలిపారు. మండల మానిటరింగ్ అధికారులు ఆయా మండలంలోని స్కూల్స్, హాస్టల్‌లను మానిటరింగ్ చేయాలని తెలిపారు. ఫుడ్ ఇంచర్జీలకు, వంటలు వండే వారికి అవసరమైన శిక్షణ, సూచనలు అందించాలని పేర్కొన్నారు. ఏమైనా సమస్యలు వచ్చినపుడు అదనపు కలెక్టర్ (రెవిన్యూ)కు తెలియజేయాలన్నారు.

అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటికే జిల్లా, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ పాఠశాలల్లో, ఇన్‌స్టిట్యూట్‌లలో కమిటీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. మండల, డివిజన్, జిల్లా స్థాయి కమిటీలు ఆయా ఇన్‌స్టిట్యూట్‌లను విజిట్ చేసి విద్యార్థులతో పాటు భోజనాలు చేయాలని పేర్కొన్నారు. అంతకుముందు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శిరీష పవార్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వేడి భోజనం విద్యార్థులకు అందించాలన్నారు. ఎన్ఫోర్స్‌మెంట్ టీమ్ పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించే విధంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలని, తరచూ విద్యార్థులకు మెడికల్ చెక్ అప్ నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ సీఈవో , జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి చందర్ నాయక్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి దయానంద్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారిణి రజిత, జిల్లా విద్య శాఖాధికారి రాజు, మండల విద్యాధికారులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వచ్చీరాని వైద్యం.. ప్రాణాలతో చెలగాటం

- ధర్పల్లిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో దారుణం
- కాలులో కర్రచువ్వను గుర్తించని వైద్యులు
- నకిలీ వైద్యంతో రోగులకు 'చుక్కలు' చూపిస్తున్నవైనం
- కొడుకు డాక్టర్.. తండ్రి ఫార్మసిస్టు తీరుతో ప్రజలు పరేషాన్
- వైద్యశాఖ అధికారులు స్పందించేనా.?



కర్రచువ్వలు చూపిస్తున్న బాధితుడు..



నవతెలంగాణ-ధర్పల్లి

పేరుకు మల్టీస్పెషాలిటీ వైద్య సేవలు చెస్తున్నట్టు ప్రచారం.. కానీ ఓ వ్యక్తి కాలులో గుచ్చుకున్న కర్ర చువ్వను సైతం గుర్తించకుండా కట్టుకట్టి ఇంటికి పంపించారు. అయినా కాలులో నొప్పి తగ్గకపోవడంతో కుటుంబీకులు కాంటాతో పెకిలించి చూడగా.. చువ్వ అదే విధంగా ఉంది. ఇదే విషయమై మళ్లీ వైద్యులను సంప్రదిస్తే ఆగమేఘాల చికిత్స చేసి తొలగించారు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రి ఓ బాధితుడికి 'చుక్కలు' చూపింది. డిజిటల్ ఎక్స్‌రే తీసినా.. అందులో గుచ్చుకున్న కర్ర చువ్వను గమనించకపోవడం గమనార్హం. మరి సదరు ఆస్పత్రిలో ఉన్నది నకిలీ వైద్యులా.. అసలు వైద్యులా అని మండల వాసులు నోరెళ్లబెడుతున్నారు. ఈ ఘటన రెండు వారాల క్రితం చోటుచేసుకోగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే..

ధర్పల్లి మండల కేంద్రంలో ఇటీవల ఓ ప్రయివేటు ఆస్పత్రి వెలిసింది. ఓ భవనం అద్దెకు తీసుకొని ఏడాది కూడా పూర్తి చేసుకొని సదరు ఆస్పత్రిలో కార్పొరేట్ మల్టీస్పెషాలిటీ స్థాయి వైద్యం అందిస్తామని జోరుగా ప్రచారం చేసుకున్నారు. ఆస్పత్రి ముందు ఓ అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి హంగుహార్బాటాలతో హంగామా సృష్టించారు. జిల్లా కేంద్రానికి వెళ్లే అవసరం లేకుండానే ప్రజల చెంతకే వైద్యం తీసుకొచ్చినట్టు చెప్పుకొచ్చారు. కానీ అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అయితే సదరు ఆస్పత్రిలో సరైన వైద్యం అందడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

గత నెల ఇదే తరహాలో మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు జ్వరం వచ్చిందని స్థానికంగా ఉన్న సదరు ఆసుపత్రికి వెళ్లాడు. వారు వైద్యం చేసినా జ్వరం తగ్గకపోవడంతో నిజామాబాద్‌కు వెళ్లాలని సిఫారసు చేశారు.

దీంతో కుటుంబీకులు హుటాహుటిన జిల్లా కేంద్రానికి వెళ్లగా అక్కడ రెండు రోజులు ఉంచుకొని, హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని చెప్పడంతో అక్కడికి తీసుకెళ్లిన రెండు రోజులకే ప్రాణాలు కోల్పోయాడు. డెంగ్యూతో మృతిచెందినట్టు సమాచారం. అయితే ఆ విషయం ముందే కుటుంబీకులకు సమాచారం ఇస్తే ఇతర ఆస్పత్రికి వెళ్లి ట్రీట్‌మెంట్ పొందేవారు. కానీ ఇక్కడే సదరు ఆస్పత్రి ఆలస్యంచేయడంతో అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

అయితే తాజాగా రెండు వారాల క్రితం మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి తన కాలుకు కర్ర చువ్వ గుచ్చుకొని ఇబ్బంది పడుతూ సదరు ఆస్పత్రికి వెళ్లాడు. వైద్యులు ముందుగా అతనికి ఎక్స్‌రే తీపించారు. అది ఎందుకు అని అడగగా.. ఈ ఎక్స్ రేతో కాలులో ఏమైందనే విషయం స్పష్టానంగా కనిపిస్తుందని, వెంట్రుక లాంటిది ఏమైనా ఉన్న స్పష్టంగా కనిపిస్తాయని దాంతో వైద్యం చేయడం సులువు అవుతుందని, ఇన్‌ఫెక్షన్ రాదని చెప్పడంతో సరేనని బాధితులు అదే ఆస్పత్రిలో డబ్బులు చెల్లించి ఎక్సరే తీయించారు. రిపోర్టు చూసిన వైద్యులు కాలులో ఏమీ లేదని నొప్పి తగ్గిపోతుందని పట్టికట్టి పంపించారు. కాగా బాధితుడికి నొప్పి తగ్గకపోగా.. మరింత ఎక్కువ అవుతూ నడిచేందుకు వీలులే నంతగా నొప్పి వచ్చింది. దీంతో బాధితుడి భార్య కాలును పరిశీలించి కర్ర చువ్వలు ఉన్నాయని కాంటాతో పెకిలించగా అవి కనిపించాయి. కర్రచువ్వలున్నాయని వైద్యులకు చూపించడంతో అప్పటి కప్పుడు ఆదరబాదరగా కాలులో నుంచి చువ్వలను తొలగించారు. వైద్య వృత్తిలో ఉన్న వైద్యుడికి ఎక్సరే తీసిన తర్వాత కూడా ఏమి లేదు అనడం.. ఏమీ తెలియని పేషెంట్ భార్య పెకిలించి చువ్వలు ఉన్నాయని గుర్తించడం గమనార్హం. దీంతో సదరు వైద్యులు నకిలీ వైద్యులా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత చేసికుడా పేషెంట్ వద్ద డబ్బులు లాగే ప్రయత్నం చేయగా.. తామెందుకు ఇస్తామని బాధితులు నిలదీస్తే సదరు డాక్టర్ తండ్రి బాధితులను దుబాయించాడు. సదరు ఆస్పత్రిలో అన్ని అతగాడి చక్కబెడుతున్నట్టు సమాచారం. కొడుకు వైద్యం చేస్తుంటే.. తండ్రి మెడికల్‌లో అన్ని తామై మండల అమాయక ప్రజలపై ఇష్టానుసారంగా దోచేసుకుం టున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తనకు జరిగిన నకిలీ వైద్యం, అన్యాయంపై సదరు యువకుడు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై సదరు ఆస్పత్రి వైద్యుడిని నవతెలంగాణ సంప్రదించేందుకు వెళ్లగా అందుబాటులోకి రాలేరు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఇలాంటి ఆసుపత్రులపై నిఘా ఏర్పాటుచేసి ప్రజల ప్రాణాలకు తాము ఉన్నామనే భరోసా కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రంథాలయాలను ఆధునీకరిస్తాం

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్దిచంద్రకాంత్‌రెడ్డి

నవతెలంగాణ-సదాశివనగర్/గాంధారి



సదాశివనగర్‌లో..



గాంధారిలో సన్మానం..

గ్రంథాలయాలను ఆధునీకరిస్తున్నట్టు జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్దిచంద్రకాంత్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని శనివారం సందర్శించారు. గ్రంథాలయానికి రంగులు వేసి ఇంకా కావాల్సిన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని తెలియజేశారు. గ్రంథాలయంలో పాఠకులకు సమయం ఉదయం 8 గం.ల నుండి సా. 7 గం.ల వరకు తెరిచి ఉంటుందని తెలియజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షులు జూకంటి సంగా రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాసరెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు సదాశివరెడ్డి, గంగాధర్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మద్దెల బాగయ్య, కాంగ్రెస్ నాయకులు ఎర్రవాటి లింగారెడ్డి, ఇర్షాద్, సాయా గౌడ్, జగ్గ బాలరాజు, బడాల భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గాంధారి : స్థానిక గ్రంథాలయాన్ని సదరు సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి సందర్శించారు. స్థానిక నాయకులు పిఏసిఎస్ సహకార సంఘ భవనంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు గ్రంథాలయం పాత భవనం శిధిలా వ్యవస్థకు చేరుకుందని దాని స్థానంలో కొత్తది నిర్మించాలని స్థానిక నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి పరమేష్ పిఏసిఎస్ చైర్మన్ సాయికుమార్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మణ్ గాంధారి తాజా మాజీ సర్పంచ్ ముంబై సంజీవ్ యాదవ్ గాంధారి మాజీ ఎంపీటీసీ సభ్యులు తూర్పు రాజులు తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ ఏజెంట్ కుచ్చుటోపి

- రైతులను ముంచి బోర్డు తిప్పేసిన వైనం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



రైతులు పండించిన పంట ను ప్రైవేట్ వ్యక్తుల దగ్గర అమ్ముకోవడంతో, కమిషన్ ఏజెంట్ రైతులకు డబ్బులు చెల్లించకుండా కమిషన్ ఏజెంట్ బోర్డు తిప్పేశారు. దీంతో నష్టపోయిన రైతులు లబోదిబోమంటున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ (శ్రద్ధానంద్ గంజ్)లో ఓ కమీషన్ ఏజెంట్ బోర్డు తిప్పేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గంజ్ లో కమీషన్ ఏజెంట్ (అడ్డి దుకాణం)గా కొన్నేళ్లుగా కార్యకలాపాలు నిర్వహించే ట్రేడర్ రాత్రికి రాత్రే నిజామాబాద్ నుండి సర్దేశారు. దీంతో ఆ వ్యాపారికి పసుపు విక్రయించిన రైతులు నెత్తి నోరు కొట్టుకుంటున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది మోర్తాడ్ మండలానికి చెందిన రైతులతోపాటు పలువురు వ్యాపారులు ఉన్నట్లు తెలిసింది. సదరు వ్యాపారి ఐపీ కూడా పెట్టడంతో తమ డబ్బులు వస్తాయో రావోనని ఆందోళన చెందుతున్నారు. గత సీజన్ కు సంబంధించిన పసుపును రైతుల నుంచి తీసుకుని కమీషన్ పై దందా చేసిన సదరు ఏజెంట్ వాటికి సంబంధించిన లెక్కల పుస్తకాలతో సహా రాత్రికిరాత్రే బిచానా ఎత్తివేశారు అని మార్కెట్ లో చర్చనీయాంశంగా మారింది. నిజామాబాద్, జగిత్యాల జిల్లా కు చెందిన రైతులు సదరు ట్రేడర్ కు పసుపును ఇచ్చినట్లు సమాచారం. రైతుకు చెల్లించాల్సిన డబ్బులు సుమారు రూ.10 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇటీవల కాలంలో ఇంత పెద్ద మొత్తంలో రైతులకు టోపీ పెట్టిన ఘటన జరగలేదు. కోట్ల రూపాయలను కమీషన్ ఏజెంట్ ముంచిన విషయం ఇప్పటికీ చాలమంది రైతులకు తెలియకపోవడానికి సబ్ ఏజెంట్లే కారణమని తెలిస్తుంది. అయినప్పటికీ సంబంధిత కమిషన్ ఏజెంట్ కార్యకలాపాలు నిర్వహించే దుకాణం తెరిచి ఉండగా.. ఈ వ్యవహారంపై దుకాణంలో పనిచేసే వారిని వివరణ కోరగా.. తమ యజమాని అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నారని సమాధానం రావడం గమనార్హం. అక్కడ ఉన్న ఇతర వ్యాపారులు మాత్రం పసుపు రైతులతోపాటు ఇతరులకు ఐపీ నోటీసులు వచ్చాయని చెబుతున్నారు. ఈ విషయమై వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులను వివరణ కోరగా.. తమకు సమాచారం లేదని, ప్రతి సీజన్ లో ఏవరో ఒక వ్యాపారి వ్యవహారం వివాదాస్పదమవుతూనే ఉందని. దళారులను నమ్మి మోసపోబద్దని, నేరుగా వచ్చి "ఈ నామ్" ద్వారా పంట దిగుబడిని విక్రయించాలని రైతులకు వ్యవసాయ మార్కెట్ అధికారులు చేస్తున్న వినతులను రైతులు పెడచెవిన పెట్టి ఇబ్బందులకు గురి అవుతున్నారని అధికారులు అంటున్నారు.

ఫుడ్ పాయిజన్ ఘటనలపై
సీఎం నిర్లక్ష్యం తగదు

- ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, ఏఐఎస్ఎఫ్
- వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతం

నవతెలంగాణ-విలేకరులబృందం



కామారెడ్డిలో నినాదాలు చేస్తున్న నాయకులు, విద్యార్థులు



నిజామాబాద్‌లో నిరసన చేపట్టిన విద్యార్థి సంఘాల నాయకులు

ఫుడ్ పాయిజన్ ఘటనలపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం వీడాలని ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాపితంగా ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వ స్కూళ్లను బంద్ చేయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలలో కల్తీ ఆహారంతో, ఫుడ్ పాయిజన్ల సంఘటనలు, పాము కాటుతో, విద్యార్థుల మరణం, మధ్యాహ్న భోజనం పథకంలో కారం మెతుకులతో, చాలీచాలని భోజనాలతో ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తూతూ మంత్రంగా పర్యవేక్షణలు చేయడం, విద్య శాఖకు మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు.

వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి ఫుడ్ పాయిజన్ల ఘటనపైన సమీక్ష నిర్వహించి దీర్ఘకాలిక కమిటీ వేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థుల మీద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలన్నారు. మధ్యాహ్న భోజనం సంబంధించిన నిధులను పెంచి, నాణ్యత కలిగిన భోజనాలను అన్ని ప్రభుత్వ పాఠశాలలో, గురుకుల కేజీబీవీలలో, సంక్షేమ హాస్టల్స్ ల లో అనేక ఘటనలు జరుగుతున్న ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. వెంటనే విద్య రంగ సమస్యలు పట్టించుకోకపోతే ప్రభుత్వానికి తగిన గుణపాఠం జరుగుతుందని హెచ్చరించారు.

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ నగరంలో ప్రభుత్వ పాఠశాల బంద్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శులు రాచకొండ విగ్నేష్, డాక్టర్ కర్క గణేష్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురామ్, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, ఏపిఎస్‌యు జిల్లా కార్యదర్శి బోడ అనిల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు దీపిక, నవీన్, కుశాల్, సాయి, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి : కామారెడ్డిలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముదా అరుణ్‌కుమార్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు జి సురేష్ , ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శివ, బీపీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్ ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టగా కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా నాయకులు మణికంఠ, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సంపత్, పి డి ఎస్ యు జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, జిల్లా నాయకులు సతీష్, శ్రీరామ్, శ్రీకాంత్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు మైముద్, ఎస్ఎఫ్ఐ జూనియర్ కళాశాల అధ్యక్షులు సునీల్, నాయకులు, పండరి, అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు బంద్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యక్షులు షైక్ ఫిర్దోస్, మండల నాయకులు జాబిర్, రాహుల్, జామిల్, ఈశ్వర్, షాదుల్, భాను, నాయకులు, పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) పిడిఎస్‌యు, ఏఐఎస్‌బి వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి పోషమైన మహేష్, సహాయ కార్యదర్శి విశాల్, ఈఎస్ఎఫ్ఐ నగర కమిటీ సభ్యులు బాబు రావు, వర్ధ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి : వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డిచ్‌పల్లి ధర్మారం బీ గ్రామంలో, జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలను పి.డి.ఎస్.యూ ఆధ్వర్యంలో బంద్ చేయించారు. కార్యక్రమాల్లో పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, జిల్లా నాయకురాలు దేవిక, కిరణ్, రేకుల అరుణ్, శ్రీకాంత్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

వర్ని : పీడీఎస్‌యూ వర్ని ఏరియా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో జిల్లా ఉపాధ్యక్షులు కార్తీక్ నడిపింటీ, నాయకులు అభయ్ సింగ్, సురేష్, విద్యాధర్ , జైస్నం, కష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి

- నూతన ఏఆర్, సివిల్ కానిస్టేబుళ్లకు పోస్టింగ్స్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఇన్‌చార్జి సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్



పోస్టింగ్ పొందిన కానిస్టేబుళ్లు

నూతనంగా రిక్రూట్ అయిన 344 మంది ఎ.ఆర్, సివిల్ కానిస్టేబుళ్లకు ఎవ్వరి విభాగంలో వారికి పోస్టింగ్స్ ఇస్తూ నిజామాబాద్ ఇంచార్జీ పోలీస్ కమీషనర్ సి. హెచ్. సింధూశర్మ శనివారం ఉత్తర్వులను జారీ చేశారు. సివిల్ విభాగంలో మొత్తం 218 కి గాను పురుషులు 150 మంది మహిళలు 68 మంది ఉన్నారు. ఎ.ఆర్ విభాగంలో మొత్తం 126 కి గాను పురుషులు 87 మంది, మహిళలు 39 మంది ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా అదనపు పోలీస్ కమీషనర్ (అడ్మిన్) కోటేశ్వర రావు మాట్లాడుతూ.. శిక్షణ పూర్తి చేసుకొని వచ్చిన సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. సిబ్బంది శిక్షణ కాలంలో నేర్చుకున్న నూతన పద్ధతులను మీ సర్వీసు మొత్తం పనికి వస్తాయని, ప్రతీ ఒక్కరు క్రమశిక్షణతో మెలగాలని, ప్రతీ ఒక్కరు తమ పై అధికారి సూచనలను తూ.చ తప్పకుండా పాటించాలని ఏ విషయం అయినను తమ పై అధికారికి తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎ.ఆర్ ఎ.సి.పి నాగయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం రిజర్వు ఇన్స్పెక్టర్స్ సతీష్, శ్రీనివాస్, తిరుపతి, ఆఫీస్ సూపరింటెండెంటులు శంకర్, బషీర్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రార్థనలో గైర్హాజరైన ఉపాధ్యాయులకు నోటీసు జారీ


ప్రార్థనలో పాల్గొన్న ఎంఈఓ నాగయ్య

నవతెలంగాణ-బోధన్
మండలంలోని కొప్పర్గ గ్రామంలోని ఉర్దూ మీడియం పాఠశాలను ఎంఈఓ నాగయ్య శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ఉపాధ్యాయులు ప్రార్థన సమయంలో గైర్హాజర్ కావడంతో ఎంఈఓ నాగయ్య పాఠశాల ఉపాధ్యాయులైన ఖాజామోయిన్, అతికుద్దీన్, రహీముద్దీన్‌కు వివరణ కోరుతూ శనివారం నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న ఉపాధ్యాయులు మూడు రోజులలో తిరిగి వివరణ ఇవ్వాలని ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వం పాఠశాలల నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరిస్తుండడంతో ఎంఈఓ నాగయ్య సైతం పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరు మెరుగుపరుచుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా ఆయన ప్రతిరోజు పాఠశాలలను తనిఖీలు చేస్తున్నారు.

స్కాలర్స్ పాఠశాలలో బ్లూ కలర్ డే



నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని స్కాలర్స్ ఒలంపియాడ్ పాఠశాలలో శనివారం బ్లూ డే కార్యక్రమం సంబురంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బ్లూ డ్రెస్ ధరించి ఆటపాటలతో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన బ్లూ కలర్స్ ఐటమ్స్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. బ్లూ కలర్ విశిష్టతను తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ టి.వేణు, ప్రిన్సిపాల్ ఒడ్డెన్న, డైరెక్టర్ సహస్ర, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యార్థులకు మంచి భోజనం అందించాలి

- తహసీల్దార్ మాలతీ

నవతెలంగాణ-ధర్పల్లి
విద్యార్థులకు మంచి భోజనం అందించాలని, వంటకాల్లో తేడాలు రాకుండా రుచికరమైన వంటకాలు వడ్డించాలని తహసీల్దార్ బండారి మాలతీ అన్నారు. శనివారం మండలంలోని రేకులపల్లి, దుబ్బాక, గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత, ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. బియ్యం నిల్వలను పరిశీలించారు. కూరగాయలు మంచివాటిని చూసి, వాటిని తరిగే సమయంలో మురుగులు రాకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. వాటిని నిల్వ ఉంచే ప్రదేశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ఎలుకలు, బొద్దింకలు ఇతర కీటకాలు లేకుండా శుభ్రంగా ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. వంటలు చేసేవారు శుభ్రంగా ఉంటూనే నాణ్యమైన వంటలను విద్యార్థులకు వడ్డించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే



ఈసీసీఈ డేలో పాల్గొన్న చిన్నారులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని కోనసముందర్ అంగన్వాడీ కేంద్రంలో పూర్వ బాల్య దశ సంరక్షణ, విద్య (ఎర్లీ చైల్డ్ హుడ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్) దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రానికి విచ్చేసిన తల్లిదండ్రులకు చిన్నారుల ప్రతిభను గురించి వివరించారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ ఎం.లక్ష్మి మాట్లాడుతూ.. 2030 సంవత్సరం నాటికి దేశవ్యాప్తంగా నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్య, పిల్లల సమగ్ర అభివృద్ధి, సంరక్షణ అందరికీ సాధ్యమైనంత తొందరగా అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. తద్వారా చిన్నారులు ఒకటవ తరగతిలో చేరేందుకు సిద్ధంగా ఉంటారన్నారు. అన్ని అభివృద్ధి క్షేత్రాలతో గరిష్ఠ ఫలితాలను సాధించడమే పూర్వ బాల్య దశ సంరక్షణ, విద్య (ఈసీసీఈ) సమగ్ర లక్ష్యమని తెలిపారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం చిన్నారులను ఆకర్షించేలా రకరకాల బొమ్మలు వస్తువులతో అలంకరించారు. కార్యక్రమంలో ఆయమ్మ శారద, చిన్నారుల తల్లులు పత్రి యశోద, సబ్బాని బాలమణి, పత్రి అనిత, ఆరేపల్లి సరిత, సూర శృతి, గమ్మత్ యమునా, కల్ల వనజ, మల్లెల శంకరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యం కాపాడాలి


పాఠశాలలోని రికార్డును పరిశీలిస్తున్న ఎమ్మార్వో శ్రీలత

నవతెలంగాణ-ఏర్గట్ల
చలి తీవ్రత నుంచి విద్యార్థినుల ఆరోగ్యం కాపాడాలని ఎమ్మార్వో శ్రీలత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను శనివారం సందర్శించారు. పాఠశాలలోని రికార్డులను, తరగతి గదులను, మూత్రశాలలను, విద్యార్థినులు బస చేసే గదులను, వంట గదిని పరిశీలించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనాన్ని మాత్రమే అందించాలని కోరారు. చలి తీవ్రత వల్ల వివిధ కారణాలతో 20 మంది విద్యార్థుల వరకు అనారోగ్యం బారిన పడ్డారని, వారిని ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ ఉండాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం పట్ల ఏ మాత్రం అలసత్వం చేయవద్దని కోరారు. రాబోయే రోజుల్లో చలి ప్రభావం ఎక్కువయ్యే అవకాశం ఉన్నందున, విద్యార్థినిల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయినులకు సూచించారు. విద్యార్థినులు చలినీటి స్నానాలు చేస్తున్నారని, వారికి వాటర్ హీటర్ అవసరం ఉందని ఉపాధ్యాయినులు కోరగా, వాటర్ హీటర్‌ల గురించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపినట్టు ఎమ్మార్వో శ్రీలత తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాల ఎస్.ఓ సంధ్యారాణి, రెవిన్యూ జూనియర్ అసిస్టెంట్లు వెంకటేష్, నవత, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలలో జేసీ హైస్కూల్ విద్యార్థుల విజయం


జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో విజయం సాధించిన జేసీ హైస్కూల్ విద్యార్థులు

నవతెలంగాణ-బోధన్
బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురు, శుక్రవారం బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ) విద్యార్థులు పలు పోటీలలో పాల్గొని విజయం సాధించారు. ఖోఖో పోటీలో ప్రథమ స్థానంలో, కబడ్డీ పోటీలో రెండవ స్థానం, వాలీబాల్‌లో రెండవ స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో రెండవ స్థానంలో నిలిచి పతకాలు సాధించారు. శుక్రవారం క్రీడా ముగింపు కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ చైర్మెన్ తూము పద్మ చేతుల మీదుగా పథకాలు అందుకున్నారు. విజేతలైన విద్యార్థులకు, పీడీ రాకేష్‌కు హెచ్ఎం బాలచంద్రం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో జరిగే క్రీడా పోటీలలో పాల్గొని మరిన్ని పథకాలు సాధించాలని హెచ్ఎం బాలచంద్రం కోరారు.

ప్రహరీ త్వరగా పూర్తి చేయండి

- జిల్లా పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు


మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-మాక్లూర్
నర్సింగ్ కళాశాలకు ప్రహరీ గోడను త్వరగా పూర్తి చేయాలని సదర్ కాంట్రాక్టర్‌కు జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశాలు జారీ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు క్షేత్రస్థాయిలో సందర్శించారు. కళాశాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ను, నర్సింగ్ విద్యార్థినులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రవేశాలు పూర్తిస్థాయిలో జరిగాయా? బోధనా తరగతులు సక్రమంగా కొనసాగుతున్నాయా? అని ఆరా తీశారు. నర్సింగ్ కాలేజ్, స్కూల్ చుట్టూ ప్రహరీ గోడ, ప్రధాన రహదారి నుంచి కాలేజీ వరకు రోడ్డు నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కంపోనెంట్ నిధులతో రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాలని సంబంధిత అధికారులకు సూచించారు. మంజూరీ లభించిన పనులను తక్షణమే ప్రారంభించాలని, వివిధ దశలలో పెండింగ్లో ఉన్న ఇతర పనులను కూడా యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ మౌనిక విలాసిని, తహశీల్దార్ శేఖర్, ఆర్ఐ షేపి తదితరులున్నారు.

అటవీ సంపదను కాపాడాలి

- యువత సామాజిక బాధ్యత తీసుకోవాలి
- అగ్ని ప్రమాదాలు సంభవిస్తే సమాచారం ఇవ్వాలి
- రేంజ్ అధికారి రవి మోహన్ భట్



నవతెలంగాణ-డిచ్‌పల్లి
అటవీ సంపదను కాపాడుకోవాలని, అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందజేయాలని రేంజ్ అధికారి రవి మోహన్ భట్ సూచించారు. రహదారి వెంట రాకపోకలు సాగించేవారు బీడీలు, సిగరెట్లు తాగి రహదారుల పక్కన పాడవేయవద్దని అన్నారు. శనివారం ఇందల్‌వాయి రేంజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో అటవీ ప్రాంతంలో ఎలాంటి అగ్ని ప్రమాదాలు చెలరేగినా అటవీ సిబ్బందికి వెంటనే సమాచారం అందించాలని వివరించారు. అటవీ సంపద అనేది సహజ సంపద అని.. ప్రజలు, యువత సామాజిక బాధ్యత తీసుకుని అడవిలో నిప్పులు, మంటలు చెలరేగితే మానవతా దృక్పథంతో స్పందించి ఎవరికి వారే ఆర్పివేయాలని పేర్కొన్నారు. అటవీ సంపదను ప్రతి ఒక్కరూ సంరక్షించి తమవంతుగా బాధ్యతగా తీసుకుని రక్షించాలని, ఇది రాబోయే రోజుల్లో తమ వారికిచ్చే ఒక గిఫ్ట్ అన్నారు. అటవీ విషయంలో ఎలాంటి సమాచారం ఉన్నా ప్రజలు వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందజేయాలని కోరారు. అడవిలో ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లు నరకడం, మట్టి తీసుకుపోవడం గానీ, వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమని అలాంటి వారు పట్టుబడితే అటవీ సంరక్షణ చట్టం కింద కేసులు నమోదు చేయనున్నట్టు తెలిపారు. ఎవరైనా అక్రమంగా అటవీ భూమిని దున్నినా, చదును చేసినా అటవీశాఖ చట్ట ప్రకారం ఆయా సెక్షన్‌లలో శిక్షా అనుభవించవలసి వస్తుందన్నారు. ఎవరైనా సరే అటవీ చట్టాలకు లోబడి ఉండాలని పేర్కొన్నారు. ఇందల్‌వాయి రేంజ్ పరిధిలో 110 గ్రామ పంచాయతీలుండగా, దానిలో 69 గిరిజన తండాలున్నాయని, ఇప్పటికే రేంజ్ పరిధిలోని ప్రజలకు అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సులు నిర్వహించి వారికి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రేంజ్ పరిధిలో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో ఫారెస్ట్ రేంజ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని వాటిని రక్షించే ప్రయత్నం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలి

- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని నాగాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను, వారి పనితీరును పరిశీలించారు. తరగతి గదులను సందర్శించిన ఆయన విద్యార్థులతో పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. వంటగదిని పరిశీలించిన ఆయన పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని తయారు చేయాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వ నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. పాఠశాల కు సరఫరా జరిగిన మధ్యాహ్నం భోజన స్టాకును ఆయన పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సంధ్య, ఉపాధ్యాయుల కిషన్, తదితరులు ఉన్నారు.

మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయాలి

- మండల అధ్యక్షుడు మీర్జాపూర్ సాయన్న

నవతెలంగాణ-కోటగిరి
మండల కేంద్రంలోని మాల మహానాడు మండల నాయకులు హైదరాబాద్‌లో జరిగే మాలల సింహ గర్జన సభకు ఆయా గ్రామాల నుంచి మాలలందరూ అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని మండలాధ్యక్షుడు మిర్జాపూర్ సాయన్న శనివారం పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో మాల కులస్తులను మోసం చేస్తున్న ప్రభుత్వాలకు మన సత్తా ఏంటో చూయించాలని, ఆదివారం జరగబోయే సింహ గర్జన సభకు ఉమ్మడి మండలాల నుంచి 1000 మంది మాల నాయకులతో తరలివెళున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల ఉపాధ్యక్షులు పుప్పల సైదయ్య, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు బ్యాగరి రాములు, జీవన్ మోరే, జంగం సాయిలు, పాల గంగారం, ఆయా గ్రామాల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు, మాల మహానాడు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి, మంత్రుల చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం, మంత్రుల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ
రైతులకు రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్, రైతుబీమా, తదితర రైతు సంక్షేమ కార్యక్రమాలు పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శనివారం మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌లో ముఖ్యమంత్రి, మంత్రులు అతిథులుగా రైతు పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని, రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో గల రైతువేదికలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు ప్రత్యక్ష ప్రసారం, రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో నిర్వహణలో భాగంగా అధికారులు, రైతులు, నాయకులు బాల్కొండ రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గున్నాల వెంకటేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగారెడ్డి, చాట్ల నరేష్, యునుస్, కుందారపు శ్రీనివాస్, అన్వర్, ఊశన్న, మజారుద్దీన్, సతీష్, వహబ్, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి 30 పడకల ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలి

- పివైఎల్, పిఓడబ్ల్యూ డిమాండ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి
మండల కేంద్రంలోని ఘన్‌పూర్‌లోనున్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలని ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్), ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో సర్వే నిర్వహించారు. రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పీ.వై.ఎల్ నిజామాబాద్ డివిజన్ అధ్యక్షులు ఎం.సాయిబాబా, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సంధ్యారాణి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు, సిబ్బంది కొరత, పేషెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను, పరిష్కరించకుండా డాక్టర్లు సమయపాలన పాటించకపోవడం, సరియైన పరికరాలు లేకపోవడం, తాగునీరు అందుబాటులో లేకపోవడం, పరిశుభ్రతను పాటించకపోవడం వంటి తీవ్ర సమస్యలు ఉన్నాయన్నారు. వైద్యం కొరకు వచ్చిన ప్రజలకు కనీసం సరిపడా టాబ్లెట్లు లేవన్నారు. పాముకాటు, తేలు, కుక్క కాటుకు వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలని వివరించారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లను నిర్వహించాలని అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించి రిపోర్ట్ త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, అలాగే అన్ని రకాల స్కానింగ్‌లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. రోగులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, గర్భిణి స్త్రీలకు మెరుగైన వైద్యం అందించాలని, చిన్న పిల్లల డాక్టర్‌ను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ నాయకులు అమూల్య రజిత, లలిత, పివైఎల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి దండు మహేష్, ఉపాధ్యక్షులు మోహన్, టియుసిఐ జిల్లా నాయకులు మురళి, నాయకులు నవీన్, ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన సంకీర్తన

- అభినందించిన ప్రిన్సిపాల్ నళిని

నవతెలంగాణ-డిచ్‌పల్లి
రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు సంకీర్తన అనే విద్యార్థి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. మండలంలోని సుద్దపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కళాశాలకు చెందిన సంకీర్తన ఆర్మూర్ మినీ స్టేడియంలో ఈ నెల 29 నుంచి 1 డిసెంబర్ వరకు జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటుందని ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. విద్యార్థిని ఎంపిక పట్ల ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వనిత, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు పిడి జోష్న, పిఈటి శ్రీలత, అకాడమీ కోచ్ వేముల మౌనిక అభినందించారు.

అలరించిన సెల్ఫ్ గవర్నమెంట్ డే

నవతెలంగాణ-బాల్కొండ
మండల కేంద్రంలోని శాంభవి ఉన్నత పాఠశాలలో శనివారం సెల్ఫ్ గవర్నమెంట్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సెల్ఫ్ గవర్నమెంట్ డే కార్యక్రమంలో భాగంగా 9వ, 10వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయు లుగా పలు తరగతులలో విద్యాబోధన చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులచే సాంస్కృతిక, కళా, నాట్య ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కళా ప్రదర్శనలలో చిన్నారులు అలరించారు. పాఠశాలలో ఇటీవల నిర్వహించిన పరీక్షల ఫలితాలలో ప్రతి తరగతిలోని విద్యార్థులలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం అభినందిస్తూ మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బొట్ల మధుసూదన్, కరస్పాండెంట్ బొట్ల రవిన్ ప్రసాద్, ప్రిన్సిపాల్ ఇంద్రాణి, వైస్ ప్రిన్సిపాల్ మంజుల, ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


శాంభవి ఉన్నత పాఠశాలలో గవర్నమెంట్ డేలో పాల్గొన్న విద్యార్థులు

గత ప్రభుత్వం అప్పుల్లో నిండా ముంచింది

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆరేపల్లి సాయిలు

నవతెలంగాణ-ఆర్మూర్
గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల్లో నిండా ముంచిదని, కెసిఆర్ ఫామ్‌హౌస్‌లో బందీగా ఉన్నప్పుడు నాయకులు ఎందుకు మాట్లాడలేదని, కాంగ్రెస్ సర్కార్‌ను విమర్శించే అర్హతలు బిఆర్ఎస్‌కు లేదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆరెపల్లి సాయిలు అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అయన మాట్లాడుతూ.. దీక్ష దివాస్ పేరుతో ఉద్యమాలు చేయడం ప్రజలు ఎవ్వరు నమ్మరని తెలిపారు. శనివారం తెలంగాణ రాష్ట్రం రేవంత్‌రెడ్డి చేతుల్లో బందీ అనే వార్త ఓ పత్రికలో రావడం పట్ల సిపిఐ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో శీను, మంగ మోహిన్, నగేష్, హలీమ్, తదితరులు పాల్గొన్నారు.

అడవికి నిప్పు పెట్టొద్దు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న బీట్ అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్
మల్కాపూర్ తాండ గ్రామాభివృద్ధి కమిటీ కార్యాలయం వద్ద మండల స్థాయి అటవీ అధికారులు అడవికి నిప్పు-నివారణ చర్యలపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ, బీట్ అధికారులు మాట్లాడుతూ.. బర్ల, మేకల కాపరులు అటవీలో అగ్గిపెట్టెలు వాడవద్దని సూచించారు. అడవికి నిప్పుపెట్టవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ విడిసి చైర్మన్ రమేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి అరవింద్, కోశాధికారి బానోత్ గోపాల్ నాయక్, వీడిసి కమిటీ సభ్యులు వసంతరావు, వెంకట్రాం, సుధాకర్, మధు, గ్రామ నాయకులు కేతావత్ ప్రకాష్ నాయక్, సునావత్ సూర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి

నవతెలంగాణ-ముప్కాల్
విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని అధికారులు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం శనివారం ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హరిజనవాడ ప్రాథమిక పాఠశాలతో పాటు వివిధ గ్రామాలలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కృష్ణ, ఎంపీడీవో నరేష్ ఆనంద్, మండల విద్యాధికారి జక్కుల రవి కుమార్ మధ్యాహ్న భోజనం నాణ్యతలను, వంటగది పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికులకు సరైన సూచనలను అందజేశారు. వంటగదిని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, సరుకులు నాణ్యతగా ఉండే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాల విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
కామారెడ్డి
ఆదివారం | డిసెంబర్ 01, 2024 | www.navatelangana.com

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

• ఎస్సై వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-తాడ్వాయి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండి జీవితంలో విజయం సాధించాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనాలు అతి వేగంగా నడిపి ప్రమాదాలకు గురై తల్లిదండ్రులకు ఇబ్బందులు కలిగించవద్దని మహిళల పట్ల చెల్లి అక్క సోదరి భావంతో మెలగాలని సూచించారు. బోధించిన పాఠాలు శ్రద్ధతో విని ఉన్నత లక్ష్యాలు నిర్దేశించికొని అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీసు బృందం ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

కూలిన మర్రి వృక్షం

నవతెలంగాణ-లింగంపేట్



లింగంపేట్ మండల కేంద్రంలో హాస్పిటల్ సమీపంలో గల మర్రి వృక్షం శనివారం ఉదయం కూలిపోయింది. గత కొన్ని రోజుల క్రితం వృక్షానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. లోపల కాలిపోవడంతో కాండం పూర్తిగా దెబ్బతిని శనివారం ఉదయం నేల కూలింది. విద్యుత్ వైర్‌పై పడటంతో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. కూలిన సమయంలో జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్టయింది. మర్రి వృక్షం ఎప్పుడు కూలిపోతుందో అని భయభ్రాంతులకు గురైన ప్రజలు కూలిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆర్ఎంబీ అధికారులకు విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో సమాచారం మేరకు అక్కడికి చేరుకొని విద్యుత్ లైన్లు మరమ్మతు చేపట్టారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న మర్రి వృక్షాన్ని జెసిబితో తొలగించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-లింగంపేట్/మద్నూర్


లింగంపేట్: నిరసన దీక్ష చేస్తున్న సమగ్ర ఉద్యోగులు


మద్నూర్‌లో...


నిజాంసాగర్‌లో...

సమగ్ర శిక్ష అభియాన్ లో పనిచేస్తున్నటువంటి తమను ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో విద్యావనరుల కేంద్ర ఎదుట నిరస దీక్షలు శనివారం చేపట్టారు. లింగంపేట్ మండల కేంద్రంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో తమను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిందని అమలు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలన్నారు. బీమా సౌకర్యం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. తమ డిమాండ్‌లు పరిష్కరించేంత వరకు దశలవారీగా ఉద్యమం చేపడతామని ప్రభుత్వం వెంటనే సానుకూలంగా స్పందించి రెగ్యులర్ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. నిరసన కార్యక్రమానికి ఉపాధ్యాయ సంఘాలు మద్దతు పలికాయి. ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు నిరసన కార్యక్రమానికి విచ్చేసి వారితో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. పిఆర్‌టియు టిఎస్ తపస్ వివిధ ఉపాధ్యాయ సంఘాలు సంఘీభావం పలికారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు గంగాధర్, విజయ్ సంఘ గౌడ్, రవి, పి ఆర్ టి యు అధ్యక్షులు రవీందర్ శర్మ, తపస్ అధ్యక్షులు సంతోష్, కార్యదర్శి సంగమేశ్వర్, ఇతర సంఘాల నాయకులు మురళీకృష్ణ ఉద్యోగస్తులు తదితరులు ఉన్నారు.

మద్నూర్ : మద్నూర్ మండల సమగ్ర శిక్ష అభియాన్ కేజీబీవీ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు మండల కేంద్రంలోని విద్యా వనరుల కార్యాలయం ఎదుట రిలే నిరసన దీక్ష చేపట్టారు. ఆందోళన చేపట్టారు ఈ సందర్భంగా సమగ్ర శిక్ష అభియాన్ యూనియన్ అధ్యక్షులు రవికాంత్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని క్రమీబద్దీకరణ హామీని నిలబెట్టుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీరికి తపస్, పీఆర్‌టీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. సంఘీభావం తెలిపిన ఎస్ఎస్ ఏ శివకాంత్ అజిత్ పవర్ సంజయ్ కుమార్ సత్యం పిఆర్టియు నాయకులు సునీల్ భీమ్ శివరాం మారుతి శీను శ్రీనివాస్ హర్షత్ అలీ పీజీ హెచ్ఎం శంకరయ్య నాగనాథ్ ఉద్యోగులు గౌతమ్ కమలాకర్ సంజీవ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన దీక్ష

కామారెడ్డి : రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల ఎంఆర్సి కేంద్రాల ముందు సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం వారి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా కామారెడ్డి మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయం ముందు మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన కార్యక్రమం తెలియజేసి వారి డిమాండ్లను డిసెంబర్ 3 లోపు నెరవేర్చకుంటే తర్వాత సమ్మెకు వెళ్తామన్నట్లు ప్రకటించరు. ఈ కార్యక్రమంలో శైలజ, మాధవి, కాళిదాస్ , సారిక, భక్తమల,మానస, కృష్ణంరాజు, గోపాల్ ,శంకర్,గణేష్,చిరంజీవి, రాములు,కవిత, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ : మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి మండలాల సిఆర్పిల అధ్యక్షులు బింగి శ్రీధర్ కుమార్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్షలో 15 సంవత్సరాలుగా పనిచేసిన కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం విద్యాశాఖలో విలీనం చేసుకొని వారికి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు కనీస వేతనం అమలు పరచాలని న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. 60 సంవత్సరాలు నిండిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు పదవి విరమణ చేసిన తర్వాత కనీసం ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా ఇంటికి పంపిస్తున్నారని, ఉద్యోగులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రమాదవశాత్తు సమగ్ర శిక్ష ఉద్యోగులు మర్ణిస్తే 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషన్ తక్షణమే చావు ఖర్చుల నిమిత్తం 15 వేల రూపాయలను అక్కడి ప్రభుత్వం అందిస్తుందన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు వందల సంఖ్యలో సమరసిక్ష ఉద్యోగులు చనిపోతే కనీసం చావు ఖర్చులకు కూడా ఒక్క రూపాయి ప్రభుత్వం అందించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పని చేస్తున్న 22,000 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఆరోగ్య కార్డు పిఎఫ్ సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు నర్సింలు, వెంకటరామ గౌడ్, శంకర్ గౌడ్, వరలక్ష్మి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగస్తుల అందరికీ అన్నివేళలా మద్దతుగా ఉంటుందని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు దేవ్ సింగ్ మద్దతు తెలిపారు. అదే విధంగా పిఆర్‌టియు నిజాంసాగర్, మహమ్మద్ నగర్ శాఖ తరపున మధ్యాహ్న భోజన సమయంలో వారికి సంఘీభావం తెలియజేసినట్లు ఉమ్మడి మండలాల అధ్యక్షులు సంతోష్ కుమార్, నారాయణలు తెలిపారు.

రేపు ఆలయ హుండీ లెక్కింపు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలం సలాబత్పూర్ ఆంజనేయస్వామి హుండీ లెక్కింపు రేపు(సోమవారం) ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం నుండి ముఖ్య అధికారులు హాజరవుతారని తెలిపారు.

రేపటి నుంచి మధ్యాహ్న భోజనం ప్రారంభం

నవతెలంగాణ-తాడ్వాయి

నందివాడ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ శనివారం తెలిపారు. గత ఏజెన్సీలకు సక్రమంగా బిల్లు రాకపోవడంతో ఏజెన్సీలు ముందుకు రాలేదని దీనితో శనివారం గ్రామ అభివృద్ధి కమిటీ విద్యా కమిటీ లతో మాట్లాడి ఏజెన్సీని ఏర్పాటు చేశామని సోమవారం నుండి మధ్యాహ్న భోజనం ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు

యువ నేతకు సన్మానం

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని సంగోజి గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువనేత గైనిశివాజీకి గ్రామస్తులు సన్మానం చేశారు. ఢిల్లీలో జరిగిన రాజ్యాంగ దినోత్సవం లో పాల్గొని శనివారం గ్రామానికి వచ్చిన ఆయన మునుముందు కూడా ఇలాంటి కార్యక్రమాలకు వెళ్లాలని కోరారు. ఈ సన్మాన సభలో గడ్డం లింగం ప్రశాంత్ రాజు మహబూబ్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-సదాశివనగర్

ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్మ సమాజ్ పార్టీ సదాశివానగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి ఎమ్మార్వో గంగాసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతి బిడ్డకి నాణ్యమైన ఉచిత విద్య అందించాలని, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందజేయాలని, నాణ్యమైన ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. భూమిలేని వారికి సాగుభూములు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కన్వీనర్ బోలెశ్వర్ కో కన్వీనర్ అరవింద్, రాజు,గంగరాజు,మండల అధ్యక్షులు కవీన్, శివరామకృష్ణ, సత్యం, బాబు సాయికుమార్, రాజశేఖర్, నితిన్, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యనాభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనాలను అందించాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికోన్నంత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ దశరథ్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నాయని, రాష్ట్రంలో పలు గురు విద్యార్థులకు ఆహారం వికటించి ఆస్పత్రి పాలయ్యారని, ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలో చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల బి.ఆర్.ఎస్ అధ్యక్షులు రంగు రవీందర్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ సభ్యులు పడిగేల శ్రీనివాస్, నాయకులు మహిపాల్, బాల్ దేవ్ అంజయ్య, లక్ష్మణ్, శ్రీనివాస్, పూసల లింగం తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

నవతెలంగాణ-కామారెడ్డి


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామ శివారులో హై టెన్షన్ వైర్ల సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల కథనం ప్రకారం ఈ విషయంపై శనివారం ఉదయం సుమారు తొమ్మిది గంటల సమయంలో ఉగ్రవాయి గ్రామ శివారులోని హై టెన్షన్ వైర్లకు సమీపంలో ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి చనిపోయినాడని దేవునిపల్లి పోలీస్ స్టేషన్ సమాచారం రాగా పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా అతని పేరు కోదండం రాజు అని జిల్లా కేంద్రంలోని గోసంగి కాలనీకి చెందిన వ్యక్తిగా దేవునిపల్లి పోలీసులు గుర్తించారు. వయసు సుమారుగా 25 నుంచి 30 సంవత్సరాల వయసు ఉంటుంది. ఈ మృతి పై దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు స్థానికులు తెలిపారు.

రైతు పండుగను వీక్షించిన రైతులు

నవతెలంగాణ-లింగంపేట్/నాగిరెడ్డిపేట్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబ్ నగర్ లో పాల్గొన్న రైతు పండగ కార్యక్రమాన్ని లింగంపేట్ రైతు వేదిక నుండి రైతులు వీక్షించారు. కార్యక్రమం లో సింగిల్ విండో దేవేందర్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు నారాగౌడ్ , ఈవో లు మధుసూదన్, రాకేష్, అమీర్, నవ్య వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : నాగిరెడ్డిపేట్ మండలంలోని నాగిరెడ్డిపేట రైతు వేదికలో రైతులు రైతు పండుగలు పాల్గొన్నారు. సభలో సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ఏవో సాయికిరణ్ దివ్య, నిఖిత, భబిత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని సితాయిపల్లి గ్రామంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం శనివారం నిర్వహించారు. శిబిరానికి పశుఘనాభివృద్ధి సంస్థ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో గర్భకోశ వ్యాధులకు 24 కృత్రిమ గర్భాధారణ, 4 సాధారణ చికిత్స ఐదు నట్టల నివారిణి, 23 మొత్తం 51 పశు వులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో మండల పశు వైద్యాధికారి రవి, పసు సహాయకులు సురేష్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ తిరుపతి, ప్రసాద్, రాములు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

నవతెలంగాణ-మద్నూర్

భారతీయ జనతా పార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులురాలు జుక్కల్ మాజీ శాసనసభ్యురాలు అరుణాచార జన్మదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు తెప్పవార్ తుకారాం, జిల్లా జనరల్ సెక్రెటరీ కృష్ణ పటేల్, దిలీప్ పటేల్, సుంకూరు అంజన్న, శ్రీపత్ పటేల్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

ఓ వ్యక్తి దారుణహత్య

నవతెలంగాణ-కామారెడ్డి


మృతి చెందిన సాయి(యేసు)

కామారెడ్డి పట్టణంలో ఉన్న గాంధీ గంజిలోని కొత్తగా నిర్మితమవుతున్న ఇంటగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్ లో ఒక గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురైయ్యాడు. తలపై, ఇతర శరీర భాగాలపై గాయాలు ఉన్నాయి. సమాచారం అందుకున్న పట్టణ సిఐ చంద్రశేఖర్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి నర్సింలు పోలీస్ స్టేషన్కు సమాచారం ఇచ్చి, అతని పేరు వివరాలు తెలుసుకోగా, సాయి (యేసు,) వయసు సుమారు 30-40 సంవత్సరాలు ఉంటుందని, నిన్న రాత్రి రోజులాగే అక్కడ పడుకునే ప్రాంతంలో పక్కన ఉన్న వేరొక రాష్ట్రానికి చెందిన భార్యాభర్తలతో గొడవ జరగగా, వారు ఇతనిని ఏదో ఒక ఆయుధంతో కొట్టి చంపి ఉండవచ్చని ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. చనిపోయిన వ్యక్తి ఆచూకీ తెలుసుకోవడం కోసం మరొక టీంను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ ఫోటోలలో ఉన్న ఆనవాళ్లను చూసి గుర్తుపట్టిన వారు ఎవరైనా కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ నందు తెలియపరచగలరని ఆయన తెలిపారు. లేదా సిఐ కామారెడ్డి టౌన్ 8712686145 ఈ నెంబర్కు ఫోన్ చేయాలన్నారు.

మద్యానికి ఉన్న మంత్రి.. విద్యకు లేదు

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో మద్యానికి మంత్రి ఉన్నాడని విద్యాశాఖకు మంత్రి లేదని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కామరెడ్డి జిల్లా శాఖ హాస్టల్ కన్వీనర్ ఖలీల్ అన్నారు. విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని, హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన 11 నెలలలోనే 51 మంది విద్యార్థుల్ని బలి తీసుకుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని, ప్రభుత్వ హాస్టల్లో నాణ్యమైన ఆహారం పెట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి నగర కార్యదర్శి సంతోష్, ఎస్ఎఫ్ఎస్ ఇన్చార్జ్ అల్తాఫ్, మోహన్, శశి, ధనరాజ్, శివ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జడ్పిహెచ్ఎస్ క్రీడాకారుల ఎంపిక

నవతెలంగాణ-కామారెడ్డి

ఈనెల 23న కామారెడ్డి లోని డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో ఉమ్మడి జిల్లా 14 సంవత్సరంలోపు బాలబాలికల హాకీ సెలక్షన్స్ లో జడ్పీహెచ్ఎస్ గర్గుల్ బాలుర విద్యార్థులు సతీష్, స్టీవెన్, వర్షిత్, కృష్ణ, లక్ష్మణ్ బాలికలు వీణ, నక్షత్ర ఎంపిక అయినట్టు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నోముల మధుసూదన్ రెడ్డి శనివారం తెలిపారు. ఈ క్రీడాకారులు ఈనెల 29 నుండి డిసెంబర్ 1 వ తేదీ వరకు కరీంనగర్ జిల్లాలోనీ హుజురాబాద్ లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నట్టు తెలిపారు. ఈ క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల ఎంఈఓ వై.ఎల్లయ్య ఉపాధ్యాయులు ఎంపికైన క్రీడాకారులను అభినందించడం జరిగిందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

చెత్తాచెదారం, మురికి లేకుండా చూడాలి

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని సోమారం గ్రామంలో కొందరు అనారోగ్యాల తో ఉన్న విషయం తెలుసుకున్న మండల పంచాయతీ అధికారిని సవితా రెడ్డి శనివారం బాధిత కుటుంబాలను పరిశీలించారు. అనంతరం ప్రధాన వీధుల్లో చెత్తాచెదారం మురికి లేకుండా చూడాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. మురికి కాలువల గుండా బ్లీచింగ్ పౌడర్ దోమల నివారణ మందులు స్ప్రే చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం తూకం వేగవంతం

• చైర్మన్ దేవేందర్ రెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్


మాట్లాడుతున్న చైర్మన్ దేవేందర్‌రెడ్డి

లింగంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని కొనుగోలు కేంద్రాల్లో దాన్యం తూకం వేగవంతంగా చేపడుతున్నట్లు సింగిల్ విండో చైర్మన్ కూచంపల్లి దేవేందర్ రెడ్డి తెలిపారు. శనివారం లింగంపేట్ మండల కేంద్రంలోని రెండో నెంబర్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎంతమంది రైతుల ధాన్యం నిలువ ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. యుద్ధ ప్రాతిపదిక మీద తూకంలో జాప్యం లేకుండా చూస్తున్నామన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లర్లకు తరలిస్తున్నామన్నారు. లింగంపేట సహకార సంఘం పరిధిలో 15 కొనుగోలు కేంద్రాలకు గాను శనివారం నాటికి 1 లక్ష 82 వేల 260 క్వింటాళ్ల ధాన్యం 3 వేల మంది రైతుల వద్ద నుండి కొనుగోలు చేశామన్నారు. మరో వారం రోజుల వ్యవధిలో కొనుగోలు 100 శాతం పూర్తి చేస్తామని అన్నారు. ఆయన వెంట సీఈవో పెంటయ్య సిబ్బంది రైతులు ఉన్నారు.

అమలు చేయని హామీలు ఎందుకు?

నవతెలంగాణ-కామారెడ్డి


కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న వికలాంగుల సేవా సమితి సభ్యులు

అమలు చేయని హామీ ఇవ్వడం ఎందుకని విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్ప దుర్గాప్రసాద్ ప్రశ్నించారు. శనివారం జిల్లా కలెక్టర్‌కు దివ్యాంగుల సమస్యలు, సంక్షేమ పథకాలు, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం రోజున జిల్లా స్థాయిలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో, నియోజకవర్గం స్థాయిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొనాలని డిమాండ్ చేశారు. 10 సంవత్సరాలుగా ముఖ్యమంత్రి పాల్గొనకపోవడం చాలా బాధాకరం అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. 6000/- పెన్షన్ పెంపు, ఉచిత రావాణా సౌకర్యం, బ్యాక్ లాగ్ ఉద్యోగాల భర్తీ, ఉన్నత విద్య, ఉద్యోగాల రిజర్వేషన్లు, ఉపాధి అవకాశాలు తదితర వాటిని దివ్యాంగుల పూర్తి సంక్షేమ పథకాల్లో అర్హులైన దివ్యాంగులను గుర్తించాలని వినతిపత్రంలో కోరమన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గాడి నర్సింలు, సబ్ కమిటీ చైర్మన్ పంగ ఈశ్వర్.వైస్ చైర్మన్ నితీష్ రెడ్డి, సభ్యులు బంటు స్వామి,బంజ రాజు తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

లబ్ధిదారుల ఇంటికి వెళ్లి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆదేశానుసా రంగా ఇంటింటి వెళ్లి పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ బండారి పరమేశ్వర్, సొసైటీ చైర్మన్ సాయికుమార్, గాంధారి మండల అధ్యక్షులు మోహన్ నాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యులు తూర్పు రాజులు, జిల్లా జనరల్ సెక్రెటరీ లైన్ రమేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మణ్, గాంధారి మాజీ సర్పంచ్ సంజీవ్ యాదవ్, సితాయిపల్లి శీను, నిల రవి, మండల యూత్ అధ్యక్షులు గణేష్, వారి వెంట గ్రామాల కాంగ్రెస్ అధ్యక్షులు కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులపై బిఆర్ఎస్ మొసలి కన్నీరు

నవతెలంగాణ-రామారెడ్డి

రాష్ట్రమంతా రైతులు పండగ జరుపుకుంటే, బి ఆర్ ఎస్ నాయకులు రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో రైతుల అభివృద్ధి ధ్యేయంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేసిన ఘనత, రైతు భరోసా, పంటల బీమా, సన్న రకం వడ్లకు రు 500 బోనస్, వంటి పథకాలతో రైతును ఆదుకుంటున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం కాదని, ప్రతిపక్ష బి ఆర్ ఎస్ కు మింగుడు పడకనే , రాద్ధాంతం చేస్తుందని , ప్రజల పక్షాన సూచనలు ఇవ్వవలసిన ప్రతిపక్షం పసలేని ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, అధికారులపై దాడులు చేయించడం, అధికారులను కించపరుస్తూ మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారని, దొరల అహంకారాన్ని ఇకనైనా తగ్గించుకోవాలని, లేదంటే ప్రజలు తిరగబడే రోజులు వస్తాయని హెచ్చరించారు.

కౌన్సిలర్ కృషితో సమస్య పరిష్కారం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి


స్తంభంను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ అధికారులు

ఎల్లారెడ్డి పురపాలక సంఘ పరిధిలోని 12వ వార్డు లో గత కొన్ని సంవత్సరాలుగా విద్యుత్ లో ఓల్టేజ్ తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికుల సమస్యను వార్డు కౌన్సిలర్ నీలకంఠం స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ అధికారులకు వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శనివారం నాడు విద్యుత్ శాఖ అధికారులు కాలనీకి 100 కేవి ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు పనులను ప్రారంభించారు. కౌన్సిలర్ నీలకంఠం అవసరమైన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను దగ్గరుండి పర్యవేక్షించారు.చాలా సంవత్సరాలుగా నెలకొన్న సమస్య పరిష్కారం కావడంతో హౌసింగ్ బోర్డ్, నీలకంఠేశ్వర కాలనీ, గూడెం ప్రాంత ప్రజల స్థానికులు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కౌన్సిలర్ నీలకంఠంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్,కాంగ్రెస్ నాయకులు తిరుపతి, పోచయ్య,వసీం, సాగర్,సుమీర్,లైన్మెన్ శశికాంత్,ఫోర్ మెన్ గంగాధర్,కాంట్రాక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ కార్యాలయానికి ఫర్నీచర్ వితరణ

నవతెలంగాణ-లింగంపేట్


ఫర్నీచర్ అందజేసిన సీనియర్ న్యాయవాది

మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయానికి రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది జలమండలి సభ్యులు మొహమ్మద్ మోయిన్ హమ్మద్ ఖాద్రి శనివారం ఫర్నిచర్‌ను అందజేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఫర్నిచర్ సక్రమంగా లేకపోవడంతో ఉన్న ఫర్నిచర్ పూర్తిగా శిథిల వ్యవస్థ చేరుకొని తుప్పు పట్టడంతో. దస్తావేదులు భద్రపరచుకోవడానికి ఫర్నిచర్ లేకుండా పోయింది. ఈ విషయమై ఎమ్మార్వో నరేందర్ హైకోర్టు న్యాయవాది దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించి రూ.50 వేల విలువచేసే ఫర్నిచర్‌ను అందజేశారు. హైకోర్టు న్యాయవాదికి ఎమ్మార్వో నరేందర్, సిబ్బంది, గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, సంగమేశ్వర్, సంగన్న రవిగౌడ్, గౌతమ్, లక్ష్మీనారాగౌడ్, సంతోష్ గౌడ్, దత్తు, విశాల్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
నిజామాబాద్
ఆదివారం | డిసెంబర్ 1, 2024 | www.navatelangana.com

రెండవ ఏఎన్ఎంలకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలి


వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రెండవ ఏఎన్ఎంలకు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిజామాబాద్ డిఎంహెచ్వో రాజశ్రీకి సన్మానించి రెండవ ఏఎన్ఎంలకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంధ్యారాణి, విజయలక్ష్మి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవ, ప్రతిభ కనబరచిన వ్యక్తులకు నామినేషన్ల స్వీకరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

క్రిస్మస్ పండుగ 2024 సందర్భంగా జరుపబోయే క్రిస్మస్ సంబరాలలో భాగంగా వివిధ రంగాలైన సామాజిక, విద్య, వైద్య, సాహిత్యం, కళ, క్రీడా రంగాలలో ఉత్తమ సేవ, ప్రతిభ కనబరచిన, ప్రతిభావంతులైన క్రైస్తవ వ్యక్తులను, సంస్థలను తెలంగాణ ప్రభుత్వం సత్కరించేందుకు నిర్ణయించిందని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి(ఎఫ్ఎసి) కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివరాలకు 040-23391067 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కెజిబివిలో తాత్కాలిక ఇంగ్లీష్ టీచర్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-మెండోరా

మెండోర కెజిబివి పాఠశాలలో ఇంగ్లీష్ సబ్జెక్టు బోధించేందుకు టీచర్ తాత్కాలిక (గెస్ట్ ఫాకల్టీ) నాలుగు నెలల కోసం దరఖాస్తులను మహిళా అభ్యర్థిలను స్వీకరిస్తున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఎంఎ ఇంగ్లీష్, బిఈడి కలిగి ఉండాలని, జీతం రూ.18000 ఉంటుందని వివరించారు. అర్హత కలిగిన అభ్యర్థులు మెండోర కెజిబివిలో దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ విజ్ఞప్తి చేశారు.

ప్రొఫెసర్ కాశీంను సన్మానించిన హరిదా రచయితలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇటీవల ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ సి.కాశీంను జిల్లాకు చెందిన హరిదా రచయితల సంఘం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో శనివారం ఆత్మీయంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హరిదా రచయితల సంఘం అధ్యక్షులు ఘనపురం దేవేందర్, డి.గోపాల్, డాక్టర్ సల్ల సత్యనారాయణ, ఎస్.గంగాధర్ పాల్గొన్నారు.

మొరం టిప్పర్ పట్టివేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ టిప్పర్ మొరం లోడుతో వెళ్తుండగా రెండవ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ యాసిర్ అరాఫత్ పట్టుకున్నట్లు శనివారం తెలిపారు. ఆర్అర్ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తుండగా రాత్రి సమయంలో అటువైపుగా వెళున్న టిప్పర్‌ను పట్టుకున్నామని పేర్కొన్నారు. ఎలాంటి డాక్యుమెంట్స్ లేకుండా మొరం ట్రాన్స్‌ఫోర్ట్ చేస్తున్న టిప్పర్‌ను ఆపి తనిఖీ చేయగా అతని దగ్గర ఎలాంటి కాగితాలు లేవని.. కావున ఆ టిప్పర్‌ను మొరంతో సహా మైనింగ్ డిపార్ట్మెంట్ వారికి తదుపరి చర్యకై తరలించామన్నారు.

అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగాపూర్‌లో అంగన్వాడి కేంద్రాన్ని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ శనివారం తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో రికార్డులను, కేంద్రానికి వచ్చే చిన్నారుల హాజరు రిజిస్టర్‌ను ఆయన పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో నిల్వ ఉన్న సరుకులను, పాలు, గుడ్లు, ఇతర వంట సామగ్రిని తనిఖీ చేసి, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. కేంద్రానికి వచ్చే చిన్నారులకు పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలని అంగన్వాడీ టీచర్ భూలక్ష్మికి సూచించారు. అంగన్వాడి కేంద్రం పరిసరాలను చెత్తాచెదారం లేకుండా ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సంధ్య, తదితరులు ఉన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్సీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నిజామాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డిని మాజీ ఎమ్మెల్సీ డి.రాజేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ నరేందర్ నిజామాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సన్మానించారు.

రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు


తనిఖీ నిర్వహిస్తున్న జిల్లా అధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలో రాత్రి 12 గంటల తర్వాత అక్రమ ఇసుకపై జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తహసీల్దార్ శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని నీలా, పేపర్‌మిల్లు, కందకుర్తి గ్రామ పరిసర ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్ఐ రవికుమార్, జూనియర్ అసిస్టెంట్ మన్సూర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఉద్రేక, వైషమ్యాల రాజకీయాలతో గెలుస్తోంది



మాట్లాడుతున్న నయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కేంద్ర ప్రభుత్వం ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టిస్తూ, లేనిది ఉన్నట్లు భ్రమలు కల్పిస్తూ, కుల, మత, ప్రాంతీయ ఉద్రేక రాజకీయాలకు పాల్పడుతూ ఎన్నికల్లో గెలుస్తుందని సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జెవి చలపతి విమర్శించారు. శనివారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిచ్‌పల్లి మండల కేంద్రంలో పార్టీ ముఖ్యులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి ఎన్.దాసు, ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బి.సూర్యశివాజీ, జేపీ గంగాధర్, సాయినాథ్ దాసు తదితరులు పాల్గొన్నారు.

హింసలను, లైంగిక దాడులను నిరోధిద్దాం

- గురుతర బాధ్యత పౌర సామాజంపై ఉన్నది
- నిజామాబాద్ జిల్లా ఫోక్సో కోర్టు న్యాయమూర్తి, అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ


జిల్లా ఫోక్సో కోర్టు న్యాయమూర్తి, అదనపు జిల్లా జడ్జి

నవతెలంగాణ-కంఠేశ్వర్

బాలలపై విస్తృతమవుతున్న అన్ని రకాల హింసలను, లైగిక దాడులకు నిరోధించాల్సిన గురుతర బాధ్యత పౌర సామాజంపై ఉన్నదని నిజామాబాద్ జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి, అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ తెలిపారు. ఈ మేరకు శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని తన చాంబర్‌లో విలేకరుల సమావేశంలో ఆమె ఫోక్సో చట్టం విశిష్టతను వివరించారు. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం-2012ను చిన్నగా ఫోక్సో చట్టంగా పిలవడం జరుగుతున్నదని తెలిపారు. ఫోక్సో చట్టం ప్రకారం ప్రత్యేక ఫోక్సో కోర్టులు ఏర్పాటు చేసినట్టు వివరించారు. 18 ఏళ్లలోపు బాల, బాలికపై జరిగిన లైంగిక దాడులను విచారిస్తాయని అన్నారు.

గతంలో అమ్మాయిలకు చట్టపరమైన రక్షణ తక్కువగా ఉండేదని, ఫోక్సో చట్టం అమలుతో వారికి చట్టపరమైన రక్షణ పెరిగిందని అన్నారు. ఫోక్సో చట్టం ద్వారా మగ పిల్లలకే శిక్షలు పడుతున్నాయని పేర్కొన్నారు. యువతీయువకులు ప్రేమ అనే ఊబిలో చిక్కుకోరాదని కోరారు. ఇంటర్నెట్, పోర్నోగ్రఫీ ప్రభావం వలన పిల్లలపై దుష్ప్రభావాలు పడుతున్నాయని అన్నారు. అక్రమ సంబంధాలు, కులాల మధ్య అంతరాల వలన పిల్లలపై ప్రభావం చూపి ఫోక్సో కేసులు పెరగడానికి ఒక కారణంగా ఆమె విశదీకరించారు. డ్రగ్స్ వినియోగం, సత్ప్రవర్తన లేకపోవడం, సభ్యత సంస్కారాలు లోపించడం అనే పరిస్థితులు మగ పిల్లలపై ప్రభావం చూపిస్తున్నాయని జడ్జి కనకదుర్గ అన్నారు. నేరాల తీవ్రతను బట్టి ఫోక్సో చట్టం ప్రకారం ఇరవై ఏళ్ళ జైలు శిక్షలు, ఉరి శిక్ష కూడా విధించాడానికి చట్టం వీలు కల్పిస్తుందని తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


భోజనంను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో వెంకటేష్ యాదవ్ మధ్యాహ్న భోజనాన్ని శనివారం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందించా లని మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులకు ఆదేశించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు, పిఆర్‌టియు మండలా ధ్యక్షులు టి.సోమలింగంగౌడ్, గ్రామ కార్యదర్శి సల్మాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జీవన్‌రెడ్డి.. ఖబడ్దార్

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

ఖబర్దార్ జీవన్ రెడ్డి ఒళ్ళు దగ్గర పెట్టుకుని ఉండాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి మాస్ వార్నింగ్ ఇచ్చారు. శనివారం పట్టణ కేంద్రంలోని సి కన్వెన్షన్ హాల్‌లో పార్టీ ముఖ్య నాయకులతో కలిసి పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డితో పాటు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర చైర్మన్లు ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ మాట్లాడిన విధానాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనబడినట్లు జీవన్‌రెడ్డికి ఆయన తమ్ముడు చేసిన అవినీతి, అక్రమాలతో ఎదుటివారు కూడా అలాగే కనబడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇంకోసారి కాంగ్రెస్ పార్టీ నాయకులపై నోరు జారితే సరికాదని సూచించారు. తనపై కూడా అనవసరమైన అసత్య ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు. తాను అవినీతి అక్రమాలకు పాల్పడింది ఉంటే సిద్దిలగుట్ట సాక్షిగా మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రమాణం చేస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాకే ఆర్మూర్‌లో జరిగిన అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపెట్టామని, గతంలో మాజీ ఎమ్మెల్యే హయాంలో అక్రమ ఇంటి నెంబర్లతో పాటు ప్రభుత్వ భూములను కబ్జాలకు పాల్పడ్డ విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుతం పెర్కిట్ శివారులో 9 గుంటలు, కోటార్మూర్ శివారులోని 202 సర్వే నంబర్‌లో ఉన్న 1ఎకరం 7గుంటల భూమిని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ బోర్డులు ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మున్ను, కౌన్సిలర్లు ఆకుల రాము, లిక్కి శంకర్, ఇంతియాజ్, నాయకులు పండిత్ పవన్, కొంతం మురళి, రెహమాన్, పార్టీ మండలాల అధ్యక్షులు ముక్కెర విజయ్, చిన్నారెడ్డి, భూమేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఫయాజ్, శేఖర్‌రెడ్డి, వాసు, నాయకులు జిమ్మి రవి, అమృతరావు, అజ్జు, బబ్లు, ఫయుం, చిట్టిరెడ్డి, రాజు, ప్రసాద్, భోజ రెడ్డి, వైయస్ మల్లారెడ్డి, అఖిల్, భూపేందర్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షణ ఉద్యోగులు నిరసన

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని కస్తూర్బా పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజన సమయంలో మండలంలోని సమగ్ర శిక్షణ ఉద్యోగులు తమ డిమాండ్లు నెరవేర్చాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పేస్కేల్ అమలు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈర్వంతరావు, భూపేందర్, రూప, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు నేషనల్ హైవే పరిశీలన


మాట్లాడుతున్న పోలీసు అధికారులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ బైపాస్ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం నేపథ్యంలో రోడ్డు భద్రతపై చేపట్టవలసిన చర్యల్లో భాగంగా ప్రమాద స్థలాన్ని ఎంవిఐ వివేకానందరెడ్డి, పట్టణ ఎస్‌హెచ్ఓ సత్యనారాయణ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెర్కిట్ బైపాస్ నేషనల్ హైవే జంక్షన్‌లో ప్రమాదానికి కారణమవుతున్న రోడ్డు డిజైన్ లోపాల గురించి, వాటి సవరణలపై ఉన్నతాధికారులకు నివేదిక పంపి వాటికి సవరణలు చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. ప్రజలందరూ రోడ్డుపై వెళ్లేటప్పుడు రోడ్డుకు అపసవ్య దిశలో వాహనాలు నడపవద్దని, హెల్మెట్ సీట్ బెల్ట్ తప్పక ధరించాలని, అతివేగంతో వెళ్ళవద్దని అన్నారు. ఎటువంటి వాహనాలు రానప్పుడే రోడ్డు దాటాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రత విభాగం కోఆర్డినేటర్ హర్ష నేషనల్ హైవే అథారిటీ ఇంజనీర్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశం


మాట్లాడుతున్న మండల విద్యాధికారి ఆంధ్రయ్య

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో మండలంలోని మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల విద్యాధికారి ఆంధ్రయ్య, తహసీల్దార్ ఆంజనేయులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి చింత రాజ శ్రీనివాస్ ఏజెన్సీ నిర్వాహకులకు పలు సలహాలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం విషయంలో తగిన జాగ్రత్తలు పాటించి విద్యార్థులకు మంచి భోజనం అందించాలన్నారు. మండల విద్యాధికారి ఆంధ్రయ్య మాట్లాడుతూ వంటగది దాని పరిసరాలు శుభ్రంగా ఉండాలని, నాణ్యమైన ఆహార పదార్థాలు ఉపయోగించాలన్నారు. వంట పాత్రలు శుభ్రంగా ఉంచాలని, వండే ముందు వంట పాత్రలను తప్పనిసరిగా కడగాలని, నూనె, పసుపు, కారం, ఉల్లి, వెల్లుల్లి, వంటకు ఉపయోగించే పదార్థాలు అన్ని కూడా నాణ్యమైనవి ఉండాలన్నారు. వంటకు ఉపయోగించే నీరు కూడా మంచి నీరై ఉండాలని, ఎక్కడ ఎలాంటి కలుషితం కాకుండా విద్యార్థులకు మంచి భోజనం అందిస్తూ జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గంగాధర్, ఉపాధ్యాయులు రాజేశ్వరగౌడ్, సిఆర్ పి లలిత, ఎంఐఎస్ సురేందర్, ఆపరేటర్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహ గర్జనకు తరలిరావాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

హైదరాబాద్‌లో నేడు నిర్వహించనున్న మాలల సింహగర్జనకు మాలలు, మాల ఉద్యోగులు స్వచ్ఛందంగా తరలిరావాలని మాల ఉద్యోగుల సంఘం నాయకుడు అలుక కిషన్ కోరారు. శనివారం సుభాష్‌నగర్‌లోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నిర్వహించనున్న సింహ గర్జనకు అందరూ ఐక్యంగా తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఎల్లం, ప్రభాకర్, జైపాల్, నిలగిరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకోవాలి

- అడిషనల్ కలెక్టర్ అంకిత్
- పలు వసతి గృహాలు పరిశీలన

నవతెలంగాణ-కోటగిరి

విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకోవాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్ తెలిపారు. శనివారం కోటగిరి మండల కేంద్రంలో పలు వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. మొదటిగా మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను, అనంతరం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని, అనంతరం కస్తూర్బా పాఠశాలను పరిశీలించారు. రుచికరమైన భోజనం విద్యార్థులకు అందించాలని, కన్న బిడ్డల వలే చూసుకోవాలని లేనియెడల చర్యలు తప్పవని ఆదేశించారు. మొదటగా భోజనం రుచి చూసిన తర్వాత విద్యార్థులకు అందించాలని, నాణ్యతకు తిలోదకాలు ఇస్తే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. రుచికరమైన, పరిశుభ్రతతో కూడిన భోజనం అందించాలన్నారు. వారి వెంట తహసీల్దార్ గంగాధర్, మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో చందర్, హాస్టల్ వార్డెన్ నరహరి, మైనార్టీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మోబిన్ తదితరులు పాల్గొన్నారు.


వంట సామాగ్రిని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చెయ్యాలి

నవతెలంగాణ-వర్ని

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వ విద్యాశాఖలో ఉద్యోగులగా విలీనం చేసి రెగ్యులర్ చేయాలని మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెగ్యులర్ చేసే వరకు సమగ్ర శిక్ష ఉద్యోగులకు పేస్కెల్ అమలు చేయాలన్నారు. రీ ఎంగేజ్ విధానాన్ని తొలగించాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ నియామకలలో వెయిటేజ్ కల్పించాలని, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా 10 లక్షలు, పదవి విరమణ కింద 10 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఆర్పీలు గంగారాం, యూసుఫ్, దత్తు, మెసెంజర్ శ్రీనివాస్, కెజిబివి స్పెషల్ అధికారి సంస్వతి, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజవర్గంలోని పలు రోడ్ల భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పలు శంకుస్థాపనలకు విచ్చేసిన సందర్భంగా ఆయనను యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వినోద్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బోర్గం ఆకాష్ రెడ్డి, నరేందర్, లింగం, లక్ష్మణ్, కాంగ్రెస్ కార్యకర్తలు యువజన నాయకులు పాల్గొన్నారు.

సంతాన నాగమ్మ ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-బోధన్

పట్టణంలోని ఏకచక్రనగర్‌లోని సంతాన నాగమ్మ ఆలయం 18వ వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు గుమ్మల అశోక్ రెడ్డి, రవి, గణేష్, ఆనంద్, రాజు, మాజీ కౌన్సిలర్ దాము, వీడీసీ సభ్యులు, బీర్కూర్ బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సంఘం లోనింగ్ మెంబర్ అయిన కల్లెడ గ్రామానికి చెందిన ఉమ్మెడ చిన్న గంగారం గత కొద్ది రోజుల క్రితం విద్యుత్ షాక్‌తో మరణించడం వలన జిల్లా సహకార బ్యాంకు నిజామాబాద్ సహకారంతో జేపీఏ ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసి మృతుని కుటుంబానికి రూ.లక్ష చెక్కును శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బుర్రోల్ల అశోక్, ఉపాధ్యక్షులు గుండారం శేఖర్, కార్యదర్శి బి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి వీడ్కోలు


పదవి విరమణ పొందిన సిబ్బందిని సన్మానించిన డిసిపి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ శాఖలో నవంబర్ 30న ఉద్యోగ విరమణ పొందిన కొంకటి సదానందంకు శనివారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరికి శాలువాలతో సత్కరించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు సర్టిఫికేటు(జ్ఞాపికలతో) ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ అదనపు డి.సి.పి (అడ్మిన్) బి.కోటేశ్వరరావు మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో ఎంతో పని ఒత్తిడితో విధులు నిర్వహించి ఎలాంటి రిమార్కు లేకుండా ఉద్యోగ విరమణ చేయడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఎ.సి.పి ఎస్.శ్రీనివాస్‌రావ్, ఆర్మ్డ్ రిజర్వు ఎ.సి.పి నాగయ్య, పోలీస్ కార్యాలయం ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, రిజర్వు ఇన్‌స్పెక్టర్స్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రానికి చెందిన కోటగిరి రాజు కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ముప్కాల్‌కు చెందిన (సదరు సేవా గ్రూప్ సభ్యులు) తమవంతు సాయంగా బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ '50కిలోల బియ్యం' కోసం రూ.2,500 శనివారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్ యాదవ్, బ్రమ్మదండి శ్రీనివాస్, మ్యాక శివ కుమార్, తాళ్లా మహేందర్, చిల్క సతీష్, ఓజా ప్రకాష్, వెంకట రమణ, గంగాధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తొర్తి గ్రామాలకు చెందిన బాధితులకు కాంగ్రెస్ నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. చెక్కుల మంజూరుకు కృషిచేసిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్‌రెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, డీసీసీ డెలిగేట్ గడ్డం జీవన్, కిసాన్ ఖేత్ మండలాధ్యక్షులు ముస్కు మోహన్‌రెడ్డి, నాయకులు రేండ్ల రాజారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, కురాకుల బొర్రన్న, ఓర్సు రాములు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతో.. రైతుల్లో సంతోషం



కోటగిరి : సమావేశంలో పాల్గొన్న రైతులు

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవి
- ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం
- పలు మండలాల్లో రైతు పండుగ సంబురాలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

కమ్మర్‌పల్లి : కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు సంతోషంగా ఉన్నారని, వ్యవసాయం పండగల ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనం వద్ద రైతు పండుగ సందర్భంగా రైతులకు రెండు లక్షల లోపు రుణాలు మాఫీ, సన్న వడ్లకు రూ.500 చొప్పున బోనస్ వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కమ్మర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నరసయ్య, వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బోనగిరి భాస్కర్, కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కప్పదండి అశోక్, కొమ్ముల రవీందర్, సుంకేట శ్రీనివాస్, సింగిరెడ్డి శేఖర్, నిమ్మ రాజేంద్రప్రసాద్, పాలెపు చిన్న గంగారం, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ప్రజా పాలన- ప్రజా విజయోత్సవాల్లో భాగంగా తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం రైతు పండుగ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా, అమిస్తాపూర్ లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు పండుగ మహాసభను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు వేదిక భవనంలో అధికారులు, రైతులు వీక్షించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని రాజశ్రీ, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో చింతరాజ శ్రీనివాస్, ఏఈఓలు రమేష్, సాయిరాం, కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, రైతు విభాగం మండల అధ్యక్షులు బోనగిరి భాస్కర్, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

స్థానిక రైతు వేదికలో రైతులతో కలిసి రైతుల పండుగ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి లావణ్య, ఏఈఓలు రేష్మ, నిహారిక, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

(యాడ్ ప్రియారిటి వార్త)

వెల్గటూర్‌లో రైతుల పండగ సంబరాలు

మెండోర : తెలంగాణ రాష్ట్ర సంక్షేమ కార్యక్రమాలు భాగంగా మెండోర మండలం వెల్గటూరు రైతు వేదికలో రైతుల పండగ సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాలలో మండల గ్రామాల రైతులు, లబ్దిదారులు పాల్గొని మీడియో కాన్ఫరెన్స్‌ను ప్రత్యేక్షంగా విక్షించారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కె.ముత్యం రెడ్డి, ప్రజాప్రతినిధులు, రైతులు, లబ్దిదారులు, మండల వ్యవసాయ అధికారి వసంత్, ఏఇఓలు రాజేశ్వర్, సాయికృష్ణ, సంధ్యారేఖ తదితరులు పాల్గొన్నారు.



మెండోర : రైతు పండుగలో పాల్గొన్న రైతులు

కోటగిరి : మహబూబ్‌నగర్ నిర్వహిస్తున్న రైతు పండుగ కార్యక్రమం రైతులందరికీ అందించాలన్న సంకల్పంత కోటగిరి రైతు వేదికలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల కోసం చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరును, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు అందించిన సందేశం వారికి చూపించారు , రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మనోహర్, మార్కెట్ కమిటీ చైర్మన్, హనుమంతు, కూచి సిద్దు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా రైతు పండుగ సంబరాలు

బాల్కొండ : మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామంలో రైతు పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రోత్సాహనికి, వేల్పూర్-మార్కెట్ కమిటీ తరపున తెలంగాణ ప్రజా ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి మండలికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కత్తి అజయ్ దంపతులను మార్కెట్ కమిటీ-వేల్పూర్ ఆధ్వర్యంలో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ కొత్తింటి ముత్యం రెడ్డి, వైస్ చైర్మెన్ గడ్డం నర్సారెడ్డి, కాంగ్రెస్ పార్టీ బాల్కొండ మండల అధ్యక్షులు గున్నాల వెంకటేష్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులు, రైతులు, పాల్గొన్నారు.

సొసైటీ ఆధ్వర్యంలో..

మండల కేంద్రంలో కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో రైతు పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నాగులపల్లి సూరజ్ రెడ్డి, డైరెక్టర్‌లు సల్ల నర్సయ్య, వేంపల్లి బాలరాజ్, సీఈఓ మొహిద్ పాషా, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, నాయకులు యూనూస్, వాహబ్, గోపు ఉషన్న, విక్కీ, సతీష్ కాంగ్రెస్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్ : మండల కేంద్రంలోని రైతు వేదికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పండగ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. అందులో భాగంగా రైతులు, నాయకులు ఈ పండుగల్లో పాల్గొన్నారు. పాలమూరులో నిర్వహించిన సిఎం రేవంత్ సభను టివిలో వీక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న హామీలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పద్మ, విస్తరణ అధికారులు, సింగిల్ విండో చైర్మన్ బుర్రోల అశోక్, డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఏర్గట్ల : మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల రైతులు, అధికారులు, నాయకులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. ఈ సందర్భంగా ఏఓ వైష్ణవ్ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు పండగను వీక్షించారని, ఈ ప్రత్యక్ష ప్రసారంలో సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులతో రైతులు ముఖాముఖిలో పాల్గొన్నారని తెలిపారు.

ముప్కాల్ : రైతు పండగ సంబరాల' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబ్ నగర్ జిల్లాలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్కాల్ రైతు వేదికలో మండలంలోని ఆయా గ్రామాల రైతులు కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి రవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యం రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు గడ్డం చిన్నారెడ్డి, వేంపల్లి సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్, ఏఈ సాయికృష్ణ, మహేష్ యాదవ్, గణేష్ యాదవ్, బద్దం సాగర్, శ్రీకాంత్, పెద్ద రాజన్న, మేడిపల్లి ముత్యం రెడ్డి, ముస్కు మోహన్, ఏలేటి రాములు, గోపిడి రాజారెడ్డి, లక్ష్మణ్, చంటి యాదవ్, కె.నారాయణ, ఏఈవోలు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు..

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



ప్రదర్శనను తల్లిదండ్రులకు వివరిస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శన శనివారం నిర్వహించారు. పలు రకాల ప్రయోగాలను ఏర్పాటు చేసి వాటి గురించి క్లుప్తంగా విద్యార్థులు తల్లి దండ్రులకు వివరించారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన అతిథులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కోటగిరి భానుచందర్, ఆకుల లక్ష్మణ్, ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

నవతెలంగాణ-ఆర్మూర్

ఢిల్లీలో కేంద్ర రోడ్డు, రవాణ, రహదారుల శాఖ మంత్రి మంత్రి నితిన్ గడ్కారీని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కలిశారు. నియోజకవర్గంలో రోడ్లపై నియోజకవర్గం నుంచి నిర్మల్‌కు నాలుగు లైన్ల రహదారి కోసం శనివారం విన్నవించారు. నందిపేట్ నుంచి నవీపేట్ వరకు నాలుగు లైన్ల రోడ్డు, ఆర్మూర్ నుంచి నందిపేట్ మీదుగా నిర్మల్ వరకు రోడ్డు విస్తరణ చేయాలని కేంద్రం నుంచి లింక్ రోడ్లు, వంతెనల నిర్మాణం కొరకు నిధులు కావాలని మంత్రిని కోరారు. అతి త్వరలో నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ బిజెపి ఎమ్మెల్యేలు, తదితరులున్నారు.

హామీలు అమలు చేయాలి

నవతెలంగాణ-బోధన్

వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చినహామీలను అమలు చేయాలని కోరుతూ అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. శనివారం తహశీల్దార్ విఠల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు సీతారాం మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 12వేల జీవనభృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలో 50శాతం పైగా వ్యవసాయ కూలీలు ఉన్నారని, తెలంగాణ రాష్ట్రంలో 55శాతం పైగా వ్యవసాయ కార్మికులు ఉన్నారని తెలిపారు. వీరికి ఏడాది పొడవున వ్యవసాయంలో పని దొరకటం లేదన్నారు. పని దొరికిన దినాలలో తక్కువ ఆదాయం వస్తుందని దీనివలన నిరుపేదలు సరైన సౌకర్యాలు లేక జీవించలేకపోతున్నారని తెలిపారు. తక్షణమే వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలు జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మికసంఘం నాయకులు జి.పీరాజీ, కబీర్ ఖాన్, పోశెట్టి, సాయిలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

నవతెలంగాణ-ధర్పల్లి

వ్యవసాయ కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలుపుకోవాలని, రూ.12వేల జీవనభృతి అమలు చేయాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళనలకు సిద్ధమవుతామని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేష్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ.. ఒకరు మృతి

నవతెలంగాణ-పొతంగల్

మండలంలో కల్లూర్ వద్ద, రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్లూర్ వద్ద ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు ఢీకొనడంతో బిచ్కుంద మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి మృతిచెందాడు. బరంగేడ్డి గ్రామానికి చెందిన ఒకరికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జంబి హనుమాన్ ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు దొండీ రమణ, జంబి హనుమాన్ ఆలయ కమిటీ డైరెక్టర్ నారాయణరెడ్డి, గోపి కిషన్ గౌడ్ డైరెక్టర్లు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.

వ్యాయామ ఉపాధ్యాయునికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తెలుగు మీడియం ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాగశయన్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ సభా అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. నాగశయన్ సేవలను కొనియాడారు.

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిజామాబాద్ అధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ద్వారకా నగర్‌లోని ప్రశాంతి న్యూరో సైకియాట్రిక్ ఆస్పత్రిలో ఎయిడ్స్ వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవగాహనా సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షులు డా.అజ్జ శ్రీనివాస్, కోశాధికారి డా.రాజేందర్ సూరినీడులు మాట్లాడారు. 23 సంవత్సరాల క్రితం డా.విద్యాసాగరరావు, డా.బాపురెడ్డి నాయకత్వాన నో ఎయిడ్స్ సొసైటీని స్థాపించి 99శాతం ఎయిడ్స్ రహిత జిల్లాగా మార్చామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంధ సంస్థలు, ప్రతి ఒక్కరూ హెచ్ఐవి/ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పిస్తూ, ఎయిడ్స్ రహిత దేశంగా మార్చడానికి ప్రచారం చేయాలని కోరారు. ఎయిడ్స్ గురించి భయ పడవలసిన అవసరం లేదని, దీనిని ధీర్ఘకాలిక వ్యాధిగా గుర్తించాలన్నారు. జీవిత కాలం మందులు వాడితే హెచ్ఐవి వ్యాధిగ్రస్థులు తమ సాధారణ జీవితాన్ని తిరిగి పొంద గలుగుతారని తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ మాజీ అధ్యక్షులు డా.దామోదర్ రావు, డా.శ్రీశైలం, ప్రెసిడెంటు ఎలెక్ట్ డా.ఆకుల విశాల్, ఉపాధ్యక్షులు డా.శ్రీధర్‌రావ్, డా.దీపక్ రాథోడ్, డా.రవితేజ, డా.అరుణ్‌రెడ్డి, డా.వెంకట రమణరెడ్డి, డా.వెంకట్, డా.ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-మోపాల్

పొలాల్లో విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు నాణ్యమైన ఐఎస్ఐ గుర్తింపు పొందిన పరికరాలలో వాడాలని విద్యుత్ శాఖ ఏడి బాలేష్, ఏఈ నాగ శ్రీవాణి సూచించారు. బోరు మోటార్‌కు కెపాసిటర్లు ఏర్పాటు చేయాలన్నారు. రైతులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని ప్రతి రైతు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఏదైనా విద్యుత్ సమస్యలుంటే తమకు సమాచారం అందించాలన్నారు. ఎల్లప్పుడు కూడా విద్యుత్ శాఖ అధికారులు లేనిదే స్వతగా విద్యుత్ వైర్లను, ట్రాన్స్‌ఫార్మర్లను ముట్టుకోవద్దని సూచించారు. విద్యుత్ శాఖకు ఏడాదికి చెల్లించాల్సిన 360 తప్పనిసరిగా చెల్లించాలని కోరారు. ఇటీవల రాత్రి వేళలో దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ కాయిల్స్‌ని చోరీ చేస్తున్నారని తమ విద్యుత్ సిబ్బందితో పాటు రైతులు కూడా తమ పంట పొలాల్లో జాగ్రత్తగ గమనిస్తూ గస్తీ నిర్వహించాలని పేర్కొన్నారు.

రైతును రాజును చేసే ప్రభుత్వం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతును రాజును చేసే ప్రభుత్వమని కాంగ్రెస్ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం పెద్దకొడప్ గల్ సొసైటీలో నిర్వహించిన రైతు పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని అన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేసిన ఘనత కాంగ్రెస్ కే చెందుతుందని అన్నారు. సన్న వరికి 500 బోనస్ అందించామని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కిషన్ ఏఈఓ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ పోలీస్ స్టేషన్ నూతనంగా బదిలీపై వచ్చిన ఎస్సై సుధాకర్‌ను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ శాలువతో ఘనంగా శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాంతిభద్రతలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరుపై ఉందన్నారు. ఫ్రెండ్లీ పోలీసులు బాగా ప్రజలు పోలీసులకు సహకరించినట్లయితే ఎలాంటి సమస్యలు తలెత్తవన్నారు. కార్యక్రమంలో లింగంపేట్ టౌన్ అధ్యక్షులు ప్రసాద్‌గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు రాజు, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ నగేష్, గౌడ రవి. అశోక్, సాయికుమార్, భాస్కర్‌గౌడ్, రమేష్, పాల్గొన్నారు.

ఆత్మ రక్షణకు కరాటే తప్పనిసరి

నవతెలంగాణ-ఎడపల్లి

ప్రస్తుత రోజుల్లో బాలికల ఆత్మ రక్షలకు కరాటే తప్పనిసరని అంబం(వై) మాజీ సర్పంచ్, బ్లాక్ బెల్ట్ కరాటే మాస్టర్ కంకెల్లి గంగాధర్ అన్నారు. ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ.. బాలికలకు మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కరటే చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు, బాలికలు, ఉన్నారు.

విద్యార్థి మృతిపై మౌనమేలా..?

- రెండ్రోజుల క్రితం అనారోగ్యంతో 9వ తరగతి విద్యార్థి మృతి
- పట్టించుకోని విద్యార్థి సంఘాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థులకు వచ్చిన సమస్యలపై గళమెత్తేవి విద్యార్థి సంఘాలు. కానీ నేడు ఆ విద్యార్థి సంఘాలు మూగబోయాయి. శివ జశ్విత్ రెడ్డి అనే విద్యార్థి మృతిచెందిన ఘటనపై ఎస్ఎఫ్ఐ మినహా.. మిగతా విద్యార్థి సంఘాలు మౌనం వహించడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన శివ జశ్విత్‌రెడ్డి అనే విద్యార్థి జిల్లా కేంద్రంలోని కాకతీయ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. అదే పాఠశాలలో హాస్టల్‌లోనే ఉండి విద్యనభ్యసిస్తున్నాడు. అయితే గురువారం అనారోగ్యానికి గురై వాంతులు చేసుకోగా హాస్టల్ వార్డెన్ ఓ మాత్ర ఇచ్చి సరిపెట్టాడు. విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా.. వారు శుక్రవారం ఉదయం స్కూల్‌కు వచ్చారు. తల్లిదండ్రులు వచ్చారని 3వ అంతస్తులోని హాస్టల్‌నుంచి కిందకు దిగి వస్తుండగా.. ఒకటో అంతస్తులో కుప్పకూలాడు. దీంతో తల్లిదండ్రులు బాలుడిని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అయితే పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే తమ కొడుకు మృతి చెందినట్టు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అనారోగ్యానికి గురైతే.. స్కూల్ పక్కనే ఆస్పత్రి ఉన్నా చూపించలేదని బోరునవిలపించారు.

ఇదిలా ఉండగా.. విద్యార్థులకు ఏ చిన్న సమస్య వచ్చినా స్పందించే విద్యార్థి సంఘాలు మాత్రం విద్యార్థి శివ జశ్విత్ రెడ్డి మృతిపై స్పందించకపోవడం గమనార్హం. ఎస్ఎఫ్ఐ మినహా.. మిగతా విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపట్టకపోగా.. ఘటన పట్ల కనీసం స్పందించకపోవడంతో గమనార్హం. కాగా విద్యార్థి మృతిపై విద్యాశాఖ అధికారులు సైతం నిర్లక్ష్యం ప్రదర్శినట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



పాఠశాల వద్ద పోలీసు బందోబస్తు

కాంగ్రెస్‌పై ఆరోపణలను మానుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి తోడు దొంగలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్ మాజీ మంత్రి, మాజీ శాసనసభ్యులు కాంగ్రెస్ ప్రభుత్వంపైన లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అబద్ధాలు మాట్లాడితే అవి నిజం కావని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను రోజువారీగా నెరవేరుస్తూనే ఉందని తెలిపారు. గ్రామాలలో తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్ వేయదని చెప్పి బీఆర్ఎస్ నాయకుల తప్పుడు మాటలతో రైతులు భయంతో వారి పంటను ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకునే విధంగా చేశారని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం బోనస్ ఇస్తున్న సందర్భంలో బీఆర్ఎస్ నాయకులు ముఖం చాటేశారని మానాల మోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతారెడ్డి రాజారెడ్డి, రాష్ట్ర ప్రచార కమిటీ మెంబర్ జావేద్ అక్రమ్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షులు రామర్తి గోపి, జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు వేణు రాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్‌గౌడ్, జిల్లా సేవాదాల్ అధ్యక్షులు సంతోష్, జిల్లా ఫిషర్ మన్ చైర్మన్ శ్రీనివాస్, రాష్ట్ర కాంగ్రెస్ స్పోక్స్ పర్సన్ చిన్న రాజేష్, నగర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రితాం, నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు వినయ్ పాల్గొన్నారు.

ఆహార కల్తీపై వినియోగదారుల చైతన్యం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆహార కల్తీపై వినియోగదారులను చైతన్య వంతులను చేసే రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా నవంబర్ 29, 30 తేదీలలో రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులు, ఫుడ్ టెక్నాలజీ విద్యార్థులకు చైతన్య కార్యక్రమాలు, నిజామాబాద్ నగరంలో వివిధ రకాల పాల నాణ్యతలపై "టెస్ట్ పర్చేజ్"లు ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, సిసీఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి చర్ల సుదర్శన్, అతిథిలుగా సైంటిస్ట్ అంజయ్య, అసోసియేట్ డీన్ డా.కల్పనలు హాజరయ్యారు. ఆహార కల్తీ పట్ల వినియోగదారులు చైతన్య వంతులు కావడంతో పాటు, ఆహార కల్తీ బాధితులకు తగిన నష్టపరిహారం పొందడానికి వినియోగదారుల రక్షణ చట్టం 2019 ద్వారానే సాధ్యమవుతుందని సాంబరాజు చక్రపాణి తెలిపారు. రైతు పంటల స్థాయిలో ఆహార కల్తీ నివారణకు కృషి విజ్ఞాన కేంద్రం శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సైంటిస్ట్ అంజయ్య తెలిపారు. ఆహార పదార్థాలలో కల్తీ ఉత్పత్తి మరియు ప్రాసెసింగ్, నిల్వ ల స్థాయిల్లో ఎక్కువగా ఉంటున్నదని, కాబట్టి విద్యార్థి స్థాయిల్లో నే ఫుడ్ టెక్నాలజీ ద్వారా విద్యార్థులను చైతన్య వంతులను చేస్తున్నట్టు డా.కల్పన తెలిపారు. అనంతరం నిజామాబాద్‌లో అమ్మకం జరుగుతున్న వివిధ రకాల పాలు, వినియోగదారులు ఉపయోగించే రెండు లేదా మూడు రోజుల ముందు గానే ప్యాకింగ్ జరుగుతున్నదని, పాలు మూడు రోజుల నిల్వ కొరకు హైడ్రోజన్ పెరాక్సైడ్ వంటి రసాయనాలు కలిపే అవకాశాలు ధృవపడుతున్నాయని ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి కార్యావర్గం తెలిపింది. ఇందూర్ కమిటీ అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు వియస్ వర్మ, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, సంయుక్త కార్యదర్శులు గైని రత్నాకర్, మహాదేవుని శ్రీనివాస్, యాటకర్ల దేవేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు సింహా గర్జనను విజయవంతం చేయండి

నవతెలంగాణ-ఎడపల్లి

మాల మహానాడు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చలో హైదరాబాద్ సింహ గర్జన సభను జయప్రదం చేయాలని మండలంలోని కుర్నపల్లి గ్రామానికి చెందిన మాల మహానాడు గ్రామ అధ్యక్షులు, ఇప్ప సాయిలు కోరారు. శనివారం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు సింహా గర్జన పోస్టర్ల విష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు జంగం గంగాధర్ మద్దతు పలికారు. మండల ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ సల్మాన్, జంగం నరేష్, గైని సత్యం, గైని అశోక్, బంటు భూమేష్ తదితరులు పోస్టర్ ఆవిష్కరించే వారిలో ఉన్నారు.